

# ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 29-04-2025 | సంపుటి - 22 | సంచిక - 364 | రూ : 4 | పేజీలు: 8

## 400- 600 చదరపు అడుగులలోపే 'ఇందిరమ్మ ఇల్లు'

- గృహ నిర్మాణశాఖ అధికారుల నిబంధనలు
- పలుచోట్ల అయోమయంలో లబ్ధిదారులు

హైదరాబాద్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపే నిర్మించుకోవాలని ప్రభుత్వం షరతు పెడుతుండటంతో పలువురు లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రంలో 70,122 ఇళ్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో 2,830 మంది లబ్ధిదారులు పునాదిని పూర్తి చేసుకున్నారు. ఇందులో సుమారు 280 మందికిపైగా 600 చదరపు అడుగులకు పైగానే ఇంటి నిర్మాణాన్ని చేపట్టినట్లు గుర్తించిన అధికారులు మొదటి విడత బిల్లు రూ.లక్ష విడుదలకు నిరాకరించారు. మళ్లీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునాదిలో తరువాయి 2లో





## భారత్‌కు రఫేల్‌ఎం జెట్‌లు!

- 26 యుద్ధవిమానాల కొనుగోలుకు ఫ్రాన్స్‌తో ఒప్పందం

దిల్లీ: భారత నౌకాదళానికి అధునాతనమైన రఫేల్ మెరైన్ జెట్‌లు అందబోతున్నాయి. ఇందుకోసం భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య రూ.64వేల కోట్ల ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయి. దీనికింద 26 రఫేల్‌ఎం జెట్‌లు మన దేశానికి అందుతాయి. వీటిలో 22 సింగిల్ సీటర్ ఫైటర్లు కాగా.. మిగతావి రెండు సీట్ల ట్రైనర్ వెర్షన్‌కు చెందినవి. ఈ యుద్ధవిమానాలను విమానవాహక నౌక తరువాయి 2లో

## అణగారిన వర్గాల అభ్యున్నతితోనే సమాజంలో మార్పు

- అందుకే అప్పట్లో మావోయిస్టులతో చర్చలు
- సీఎం రేవంత్‌రెడ్డితో అనుభవాలను పంచుకున్న జానారెడ్డి, కేశవరావు
- శాంతి చర్చలపై అధిష్ఠానం అభిప్రాయం కోరాలని నిర్ణయం



హైదరాబాద్: వామపక్ష తీవ్రవాదాన్ని తమ ప్రభుత్వం సామాజిక సమస్యగానే పరిగణిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశం నిర్ణయించింది. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్రానికి లేఖ రాసే కంటే ముందు తమ పార్టీ అధిష్ఠాన నిర్ణయం తెలుసుకోవాలని అభిప్రాయానికి వచ్చారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆధ్వర్యంలోని శాంతి చర్చల కమిటీ ఆదివారం సీఎంను కలిసి ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు జరుపుతున్న గాలింపును నిలిపివేసి తరువాయి 2లో

## ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత!

- విభజన చట్టంలో సవరణకు అవకాశం ఉందేమో పరిశీలిద్దాం
- ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ గడువు ముగిసింది కాబట్టి ఇబ్బంది ఉండకపోవచ్చు
- ఈ అంశాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళతా
- రిటర్నబుల్ ప్లాట్లకు రుణమిచ్చేలా బ్యాంకులతో మాట్లాడతా
- అమరావతి ప్రస్థానాన్ని వివరిస్తూ మ్యూజియం ఏర్పాటు
- రాజధాని రైతులు, మహిళలకు చంద్రబాబు హామీ
- పునఃప్రారంభోత్సవానికి కుటుంబాలతో కలిసి రావాల్సిందిగా ఆహ్వానం

2లో



## మెరిసిన తెలుగు ప్రతిభా పద్మాలు



2లో

- డాక్టర్ నాగేశ్వరరెడ్డికి పద్మ విభూషణ్, బాలకృష్ణకు పద్మ భూషణ్
- మిరియాల అప్పారావు, మాడుగుల నాగఫణి శర్మలకు పద్మశ్రీ
- తొలి విడతగా మొత్తం 71 మందికి పౌర పురస్కారాలు
- రాష్ట్రపతి భవన్‌లో ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

## నగరం.. సుందరీకరణం

- మిస్ వరల్డ్ పోటీలకు రూ.1.79 కోట్లతో ఏర్పాట్లు

హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీలకు హైదరాబాద్ నగరం అందంగా ముస్తాబు కానుంది. మే 7 నుంచి 31 వరకు హైటెక్స్‌లో జరిగే ఈ పోటీల కోసం జీహెచ్‌ఎంసీ రూ.1.79 కోట్ల అంచనాతో ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. హైటెక్ సిటీ చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు చార్మినార్, ట్యాంక్‌బండ్, రాష్ట్ర సచివాలయం, దుర్గంచెరువు తదితర తరువాయి 2లో






## సైనిక సన్నద్ధతపై కీలక భేటీలు

- ప్రధాని మోదీతో రాజ్‌నాథ్ 40 నిమిషాల పాటు చర్చ
- అంతకుముందు త్రిదళాధిపతితో రక్షణ మంత్రి మంతనాలు
- 16 పాక్ యూట్యూబ్ ఛానళ్లపై కేంద్రం నిషేధం
- మా దేశ ఉనికికి ముప్పు కలిగితే అణ్వాయుధాలు వినియోగిస్తాం: పాక్
- పాకిస్థాన్ సార్వభౌమాధికారం పరిరక్షణకు మద్దతు: చైనా
- సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోండి: అమెరికా

2లో

## మందుపాతరలున్నా.. ముందుకే..

: కర్రెగుట్టల్లో ఏడో రోజూ కొనసాగిన అన్వేషణ

* నాలుగు రోజుల క్రితం మృతిచెందిన మహిళా మావోయిస్టుల గుర్తింపు

* ఐఈడీలు, బాటిల్ బాంబుల నిర్వీర్యం

2లో



# సైనిక సన్నద్ధతపై కీలక భేటీలు

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్ మధ్య రాజుకున్న ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. సరిహద్దుల్లో నియంత్రణ రేఖ వెంట వరుసగా నాలుగో రోజూ పాక్ సైన్యం కవ్వింపులకు పాల్పడింది. కొత్తగా పూంఛ్ సెక్టార్‌లో భారత సైనిక శిబిరాలపై కాల్పులు జరపగా భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. పహల్గాం ఉగ్రదాడిపై ఎలా ప్రతిస్పందించాలనే దానిపై కేంద్రప్రభుత్వ స్థాయిలో విస్తృత మంతనాలు జరుగుతున్నాయి. అటువైపు పాకిస్థాన్ కూడా వ్యూహాల్లో నిమగ్నమై ఉంది. తుర్కియే నుంచి సైనిక రవాణా విమానాలు ఇస్లామాబాద్‌కు చేరుకున్నాయి. సార్వభౌమాధికారం పరిరక్షణలో పాకిస్థాన్‌కు అండగా ఉంటామని చైనా ప్రకటించింది. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలంటూ అమెరికా సూచించింది.

### రాజ్‌నాథ్ వరుస భేటీలు

ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం అణ్వస్త్రాలను ప్రస్తావించిన నేపథ్యంలో...భారత ప్రభుత్వం తగు వ్యూహం ఖరారులో నిమగ్నమైంది. ఈ క్రమంలోనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. పహల్గాంలో పరిస్థితులతో పాటు సన్నద్ధత అంశమై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించినట్లు తెలిసింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్ కూడా పాల్గొన్నారు. దాదాపు 40 నిమిషాల పాటు కొనసాగిన సమావేశం అనంతరం అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు. అంతకుముందు త్రిదళాధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్‌తో రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. అక్కడ తీసుకున్న కీలక నిర్ణయాల వివరాలను ప్రధానికి రక్షణ మంత్రి వివరించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులకు కఠిన శిక్ష తప్పదని ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమైన మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. బాధితులకు తప్పక న్యాయం జరుగుతుందని, ఉగ్రదాడి ఘటనతో దేశ ప్రజల రక్తం మరుగుతోందన్నారు. ప్రధాని మోదీ వ్యాఖ్యల నేపథ్యంలో జరుగుతున్న వరుస భేటీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సోమవారం సాయంత్రం పార్లమెంటు ప్రాంగణంలో.. రక్షణ వ్యవహారాల స్థాయీ సంఘం సమావేశమైంది. ఎంపీలు రాధా మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, విష్ణుపాల్ రే, జగన్నాథ్ సర్కార్, శక్తి సింగ్ గోహిల్, సంజయ్ సింగ్ హాజరయ్యారు.

### మళ్లీ రెచ్చగొట్టిన పాక్..

పాకిస్థాన్ సైన్యం వరుసగా నాలుగో రోజూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు పాల్పడింది. దీన్ని భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. 'ఆదివారం అర్ధరాత్రి వేళ కుప్వారా, పూంఛ్ జిల్లాల్లోని నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం లక్షిత కాల్పులకు తెగించింది. భద్రతా బలగాలు తక్షణమే స్పందించి శత్రువుల దాడిని తిప్పికొట్టాయి' అని భారత సైన్యం సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. పూంఛ్ సెక్టార్‌లో పాక్ ఆర్మీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ఈ మధ్య కాలంలో ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొంటున్నారు.

### ఉగ్ర స్థావరాల సమీపంలోకి సైన్యం

26 మంది పర్యాటకులను హత్య చేసిన ఉగ్రవాదుల కోసం భద్రతా దళాల వేట తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. దక్షిణ కశ్మీర్లోని అడవుల్లో భద్రతా దళాలు ఇప్పటికే నాలుగు సార్లు అత్యంత సమీపంలోకి వెళ్లగా ఉగ్రవాదులు త్రుటిలో తప్పించుకొని తెలుస్తోంది. ఉగ్రవాదులను తొలుత అనంతనాగ్‌లోని పహల్గాం తెహస్లీ వద్ద, తర్వాత కుల్గాం అడవుల్లో కదలికలు కనిపించాయి. అక్కడికి చేరుకొన్న భద్రతా దళాలపై కాల్పులు జరిపి పారిపోయారు. తిరిగి త్రాల్ కొండల్లో, అనంతరం కొకెర్నాగ్‌లో లొకేషన్ బయటపడింది.

### పాక్ యూట్యూబ్ ఛానళ్లపై వేటు

భారత్‌కు వ్యతిరేకంగా కథనాలను ప్రసారం చేస్తున్నాయన్న ఆరోపణలతో 16 పాక్ యూట్యూబ్ ఛానళ్లను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. డాన్ న్యూస్, జియో న్యూస్, సామా టీవీ సహా పలు మీడియా ఛానళ్లు, కొంతమంది పాత్రికేయుల సామాజిక మాధ్యమ ఖాతాలపై వేటు వేసింది. పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ ఛానల్ కూడా వీటిలో ఒకటి.

### * పహల్గాం కవరేజీపై బీబీసీకి కేంద్రం లేఖ

జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని 'మిలిటెంట్ దాడి'గా పేర్కొంటూ బీబీసీ వార్తా సంస్థ కథనాన్ని ప్రచురించడంపై కేంద్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'కశ్మీర్‌లో దాడి అనంతరం భారతీయుల వీసాలను పాకిస్థాన్ సస్పెండ్ చేసింద'ంటూ ఒక వ్యాసంలో బీబీసీ పేర్కొనడంపైనా మండిపడింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భారత్‌లోని బీబీసీ అధిపతి జాకీ మార్టిన్‌కు లేఖ రాసింది. ఇక నుంచి బీబీసీ కవరేజీని పర్యవేక్షిస్తామని లేఖలో పేర్కొంది.

# 400 600 చదరపు అడుగులలోపే 'ఇందిరమ్మ ఇల్లు'

(మొదటిపేజీ తరువాయి)

మార్పులు చేసుకుంటేనే బిల్లులు అందిస్తామని చెబుతున్నారు.

### అప్పుడలా.. ఇప్పుడిలా.. ఇలా అయితే ఎలా?

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సొంత స్థలాలు ఉన్నవారు తమకు నచ్చిన విస్తీర్ణంలో నిర్మాణాలు చేసుకోవచ్చని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రభుత్వం పలు సందర్భాల్లో వెల్లడించింది. మోడల్ ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులో ఉంచినప్పటికీ ఎలాంటి నిబంధనలను పెట్టబోమని తెలిపింది. తాజాగా అధికారులు 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్యలోనే ఇంటిని నిర్మించుకోవాలని పదేపదే చెబుతుండడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో పాటు తాము కూడా ఇంటికి అదనంగా ఖర్చు చేసుకుంటున్నామని, ఇప్పుడు నిబంధనలు విధిస్తే ఎలా అని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 600 చదరపు అడుగులు దాటితే బీపీఎల్ పరిధిలోకి రారని అధికారులు అంటున్నారు. వాస్తవానికి పేదల ఇళ్లను 400 చదరపు అడుగుల్లోనే నిర్మించాలని, ప్రభుత్వం అదనంగా 200 చదరపు అడుగులకు పెంచిందని హౌసింగ్ శాఖ అంటోంది. మే 5వ తేదీలోపు ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఉండాలనే నిబంధనను విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా యంత్రాంగాలకు గృహ నిర్మాణశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్నారు.

# భారత్‌కు రఫేల్‌ఎం జెట్‌లు!

(మొదటిపేజీ తరువాయి)

ఐఎన్ఎస్ విక్రాంత్‌పై మోహరిస్తారు. తాజా ఒప్పందంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఫ్రాన్స్ సాయుధ దళాల మంత్రి సెబాస్టియన్ లెకోర్నులు సంతకాలు చేశారు. ఈ ప్రతులను రెండు దేశాల అధికారులు ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భారత రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి థియెర్రీ మథౌ పాల్గొన్నారు. రఫేల్‌ఎంను ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్ సంస్థ ఉత్పత్తి చేస్తోంది. భారత వైమానిక దళం వద్ద ఇప్పటికే 36 రఫేల్ జెట్‌లు ఉన్నాయి. వీటికి.. కొత్తగా సమకూర్చుకోనున్న నౌకాదళ వెర్షన్‌తో సారూప్యతలు ఉంటాయి. ఫలితంగా రెండు దళాల మధ్య సమన్వయం మరింత పెరుగుతుంది. నేవీ మరింత శక్తిమంతమవుతుంది.

### తాజా ఒప్పందం ప్రకారం..

* రఫేల్ జెట్‌ల బాడీ ఉత్పత్తికి భారత్‌లో ఒక కేంద్రం ఏర్పాటవుతుంది. అలాగే ఈ యుద్ధవిమానాల ఇంజిన్లు, సెన్సర్లు, ఆయుధాల నిర్వహణ, మరమ్మతులకు ప్రత్యేక వసతులు సిద్ధమవుతాయి.
* భారత స్వదేశీ ఆయుధాలను ఈ యుద్ధవిమానాలతో అనుసంధానం చేయడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఫ్రాన్స్.. మన దేశానికి బదలాయిస్తుంది.
* ఒప్పందం కింద తొలి యుద్ధవిమానం 2028లో భారత్‌కు అందుతుంది. చివరి జెట్ 2030లో వస్తుంది. ఈ యుద్ధవిమానాల వినియోగంపై మన నౌకాదళ సిబ్బందికి ఫ్రాన్స్, భారత్‌లో శిక్షణ ఇస్తారు. సిమ్యులేటర్లు, ఇతర సాధన సంపత్తి, ఆయుధాలు అందిస్తారు.
* భారత వైమానిక దళం వద్ద ప్రస్తుతం ఉన్న రఫేల్ యుద్ధవిమానాలకు అదనపు సాధనాలను అందించడం కూడా ఈ ఒప్పందంలో భాగం.

# ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐ వైస్ ఛైర్‌పర్సన్‌గా శాంతికుమారి



హైదరాబాద్: మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐ) వైస్ ఛైర్‌పర్సన్‌గా ఎ.శాంతికుమారి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం పనిచేస్తున్న ఈమె.. ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. పదవీ విరమణ అనంతరం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐ వైస్ ఛైర్‌పర్సన్‌గా శాంతికుమారి బాధ్యతలు స్వీకరిస్తారు. ఈమెకు ఇదే సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు సోమవారం వేర్వేరు ఉత్తర్వులు విడుదల చేశారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతితోనే సమాజంలో మార్పు

(మొదటిపేజీ తరువాయి)

మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని కోరిన విషయం తెలిసిందే. గతంలో హోంమంత్రి హోదాలో మావోయిస్టులతో చర్చలు జరిపిన జానారెడ్డితోపాటు ఇతర మంత్రులతో చర్చించి దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటామని సీఎం వారికి హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం జానారెడ్డి ఇంట్లో సమావేశం నిర్వహించారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేశవరావు హాజరయ్యారు. శాంతి చర్చల కమిటీ చేసిన ప్రతిపాదనలు, ఇందులో సాధ్యాసాధ్యాలు, తాము అనుసరించాల్సిన విధానం గురించి ముగ్గురూ దాదాపు గంటసేపు చర్చించారు. 2005లో జరిగిన శాంతి చర్చల్లో జానారెడ్డి, కేశవరావు ఇద్దరూ పాల్గొన్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ శాంతిభద్రతల సమస్య కంటే సామాజిక సమస్యగానే పరిగణిస్తుందని, అణగారిన వర్గాల అభ్యున్నతితోనే సమాజంలో మార్పు తీసుకురావచ్చని నమ్ముతుందని, అందుకే అప్పట్లో మావోయిస్టులను చర్చలకు పిలిచిందని వారు తెలిపారు. ఇదే సమయంలో ఏరూపంలో ఉన్నా హింసను సహించేది లేదన్నారు. 2005 నాటి శాంతి చర్చలు మంచి ఫలితాలు ఇచ్చాయని, అనేక ప్రాంతాల్లో హింస చాలావరకు తగ్గుముఖం పట్టిందని చెప్పారు. శాంతి కమిటీ చేసిన విజ్ఞప్తిపై తమ వంతు ప్రయత్నం చేయాలని సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. అంతకంటే ముందు ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అభిప్రాయం తెలుసుకోవాలని, ఈ మేరకు లేఖ రాయాలని నిర్ణయానికి వచ్చారు.

# మందుపాతరలున్నా.. ముందుకే..

చర్ల, వెంకటాపురం : తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు అడుగడుగునా మందుపాతరల గండం ఎదురవుతున్నా ఏడో రోజు సోమవారం కూంబింగ్ కొనసాగించాయి. మావోయిస్టులు తమ కీలకమైన స్థావరాల సమీపంలో రక్షణగా ఏర్పాటు చేసిన బాంబులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నాయి. ఇప్పటివరకు సుమారు 150 ఐఈడీలను బలగాలు గుర్తించాయి. సోమవారం సాయంత్రం నడిపల్లిగల్లం నడుమ అరగంట పాటు కాల్పులు జరిగినట్లుగా అక్కడి ప్రజలు చెబుతున్నారు. ములుగు జిల్లాలోని పామునూరు సమీప ఒక్కడుగు గుట్ట, ముకునూరు ఎత్తుగుట్ట, దేవునిగుట్టల బాటల్లో ఐఈడీలను భద్రతా బలగాలు గుర్తించాయి. పదుల మీటర్ల దూరంలో తీగలు అమర్చి మందుపాతరలను పాతిపెట్టిన వాటిని చాకచక్యంగా నిర్వీర్యం చేశారు. ఇదే క్రమంలో కొత్త పంథాలో మావోయిస్టులు బీరు సీసాల్లో ఏర్పాటు చేసిన బాంబులు సైతం తాజాగా వెలుగులోకి వచ్చాయి. బీజాపూర్ జిల్లా నైరుతి దిశ అడవుల్లో నాలుగు రోజుల క్రితం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన ముగ్గురు మహిళా మావోయిస్టుల వివరాలను పోలీసులు సోమవారం వెల్లడించారు. వీరు పీఎల్‌జీఏ నంబర్ 1 బెటాలియన్‌కు చెందిన సభ్యులు శాంతి, హుంగీ, సింటేలుగా వెల్లడించారు. అడవులను జల్లెడ పడుతున్న బృందాలు అక్కడి గిరిజనులను చక్రబంధం చేసినట్లు తెలుస్తోంది. వాజేడు, వెంకటాపురం మండలాల్లోని పెనుగోలు, పామునూరు, చెలిమల ప్రాంతాల్లో ఆంక్షలు విధించినట్లు సమాచారం. ప్రతి వారం మండల కేంద్రాల్లోని వార సంతలకొచ్చి నిత్యావసరాలు కొనుగోలు చేసుకునే ఆదివాసీలు బయటికి రాకుండా ఇళ్లలోనే ఉండిపోయారు.

# నగరం.. సుందరీకరణం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లో థీమాటిక్ లైటింగ్, సెల్ఫీ పాయింట్లు, ఎల్‌ఈడీ విద్యుద్దీపాలతో ప్రపంచ సుందరి కిరీటం నమూనాలను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. పనులు త్వరలోనే మొదలుకానున్నాయి. విమానాశ్రయం రహదారి పక్కన 130 దేశాల జాతీయ పతాకాలను ఏర్పాటు చేయనున్నారు. 'మిస్ వరల్డ్ 2025' ఆంగ్ల అక్షరాలు, భారీ స్వాగత బోర్డుల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. తెలంగాణ సచివాలయం వద్ద 20 దేశాల జెండాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రూ.28,96,900 వ్యయమవుతుందని అంచనా వేశారు. హైటెక్ సిటీలోని దుర్గం చెరువు, ఏఎంబీ మాల్, గచ్చిబౌలి, రాయదుర్గం మెట్రో స్టేషన్‌ల వద్ద సెల్ఫీ పాయింట్లు, స్వాగత తోరణాలు (ఆర్చ్), డాంగ్లర్స్, బంటింగ్స్, ఎల్‌ఈడీ కిరీటం, ఫెయిరీ క్వీన్ వంటి అలంకరణలు ఏర్పాటు చేయడానికి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం రూ.34,10,200తో టెండర్లు పిలిచింది. రూ.28,32,000తో శిల్పారామం, బయోడైవర్సిటీ పార్కు వద్ద విద్యుద్దీపాలంకరణ చేపట్టనున్నారు. రూ.11,60,000తో చార్మినార్ పక్కనున్న లాడ్‌బజార్ రహదారిని డెకరేటివ్ లాంథర్ లైటింగ్‌తో అలంకరిస్తారు. ఓ సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయనున్నారు.

# ఆంధ్రప్రదేశ్.. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత!



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ విభజన చట్టంలో పార్లమెంటు ద్వారా సవరణ చేసేందుకు అవకాశం ఉందేమో పరిశీలించి, చేయిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళతానని రాజధాని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలకు పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని విభజన చట్టంలో పేర్కొన్నారని, ఇప్పుడు ఆ గడువు ముగిసింది కాబట్టి.. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేసేందుకు ఇబ్బంది ఉండకపోవచ్చని ఆయన పేర్కొన్నారు. రాజధాని అమరావతి పనుల్ని ప్రధాని మోదీ మే 2న పునఃప్రారంభించనున్న నేపథ్యంలో చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో సోమవారం రాజధాని రైతులు, మహిళలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాజధాని పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి రాజధాని రైతులంతా కుటుంబసభ్యులతో రావాలని సీఎం ఆహ్వానించారు. ఆ సందర్భంగా రాజధాని రైతులు తమ ఆకాంక్షల్ని ఆయన ముందుంచారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందీ లేకుండా.. ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతిని కేంద్ర ప్రభుత్వం ప్రకటించేలా చేయాలని రైతులు కోరారు. ఎన్డీయేలో తెదేపా కీలక భాగస్వామిగా ఉన్నందున చంద్రబాబు చెబితే ప్రధాని మోదీ వింటారని వారు పేర్కొన్నారు. దానిపై చంద్రబాబు స్పందిస్తూ... 'అది మన పరిధిలోని అంశం కాదు. మనం డిమాండ్ చేయకూడదు. సామరస్యంగా అన్నీ సాధించుకుందాం' అని పేర్కొన్నారు. మే రెండో తేదీ రాష్ట్ర చరిత్రలో మైలురాయి కాబోతోందని.. రాజధాని నిర్మాణంలో ఇదో కీలక ముందడుగు అవుతుందని ఆయన తెలిపారు. రైతుల త్యాగం వల్లే అంతర్జాతీయ స్థాయి రాజధాని నగరాన్ని నిర్మించుకుంటున్నామని.. వారి మంచి మనసును రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకుంటారని సీఎం కొనియాడారు. ఈ సందర్భంగా రైతులు, మహిళలతో ఆయన ముచ్చటించి... వారి సందేహాలు నివృత్తి చేశారు. రైతులకిచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు బ్యాంకులు రుణాలివ్వడం లేదని పలువురు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను సత్వరం పరిష్కరిస్తామని, రుణాలిప్పించేలా బ్యాంకులతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. రాజధానివాసులకు అండగా ఉండేందుకు, భరోసా కల్పించేందుకే తానూ అమరావతిలో ఇల్లు కట్టుకుంటున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రితో తమ చర్చల సారాంశాన్ని అనంతరం రాజధాని రైతులు విలేకర్లకు వెల్లడించారు. అదనపు భూసమీకరణతో ధరలు పడిపోతాయనేది అపోహే రాజధానికి ఆనుకొని ఉన్న గ్రామాల్లో అదనంగా తలపెట్టిన భూసమీకరణ గురించి రైతులు ప్రస్తావించగా.. హైదరాబాద్ మహానగరంలా అమరావతి అభివృద్ధి చెందాలంటే విశాలంగా ఉండటం ఎంతైనా అవసరమని చంద్రబాబు అన్నారు. అదనపు భూసేకరణ కారణంగా ఈ ప్రాంతంలో ధరలు పడిపోతాయనేది అపోహలు మాత్రమేనని... వాటిని నమ్మొద్దని సూచించారు. 'ఉమ్మడి రాష్ట్రంలో శంషాబాద్ విమానాశ్రయానికి భూసేకరణ చేసినప్పుడు 5 వేల ఎకరాలు ఎందుకని కొందరు ప్రశ్నించారు. అప్పుడు ముందుచూపుతో భూమి సేకరించబట్టే నేడు అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం నిర్మాణంతో పాటు పెద్ద హోటళ్లు, మాల్స్ వచ్చి ఆర్థిక కార్యకలాపాలు భారీగా పెరిగాయి. చుట్టుపక్కల భూముల విలువ పెరిగి రైతులకు మేలు జరిగింది' అని చంద్రబాబు వివరించారు. అమరావతిలో కూడా భవిష్యత్తులో అంతర్జాతీయ విమానాశ్రయం, క్రికెట్ స్టేడియం నిర్మాణాలకు మరికొంత భూమి అవసరమవుతుందని.. దీనికి అనుగుణంగానే అదనంగా భూసమీకరణ చేస్తున్నట్టు వివరించారు.

* అమరావతి రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

### మీ అభీష్టానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయం ఉండదు

'స్వచ్ఛందంగా భూములిచ్చిన మీ అభీష్టానికి వ్యతిరేకంగా, నష్టం జరిగేలా ఏ కార్యక్రమం, నిర్ణయం ఉండదు. రైతులకు నాకు మధ్య దూరం ఉండదు. మీ ప్రయోజనాలకు విరుద్ధంగా ఏమీ జరగదు' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కృష్ణా నదిపై మరో మూడు నాలుగు వంతెనలు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు వస్తాయన్నారు. రాజధాని ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల త్యాగాలకు గుర్తుగా ఓ స్మారకాన్ని నిర్మించాలని రైతులు కోరగా.. శాతవాహనుల నుంచి అమరావతి ఉద్యమం వరకూ ప్రతి విషయాన్ని, పరిణామాన్ని క్రోడీకరిస్తూ మ్యూజియం ఏర్పాటు చేస్తానని చెప్పారు. మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభద్రతలో కేసీఆర్

హైదరాబాద్: ''ఎల్కతుర్తి సభలో కేసీఆర్ మాటల్లో అభద్రత కనిపించింది. ఆయన ప్రసంగంలో పస లేదు. స్పష్టత లేదు. కాంగ్రెస్‌పై తన అక్కసునంతా వెళ్లగక్కారు. కేసీఆర్ ఏం చేసినా.. భారాసను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అసెంబ్లీలో భారాస తరఫున మాట్లాడుతున్నది పిల్లగాళ్లని ఆయనే చెప్పేశారు. మరి వారినెందుకు అసెంబ్లీకి పంపిస్తున్నారు'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి ఇంటి వద్ద సోమవారం సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''ఆపరేషన్ కగార్‌పై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన చర్చల మేరకు.. ఈరోజు జానారెడ్డి, కేకేలతో చర్చించాం. ఈ అంశంపై జాతీయస్థాయిలో చర్చ జరగాలి. మా పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత.. ప్రభుత్వ విధానం ప్రకటిస్తాం. రాహుల్ గాంధీకి, నాకు మధ్య అంతరం (గ్యాప్) ఉందనడం అవాస్తవం. మా మధ్య మంచి సంబంధాలున్నాయి. మా ఇద్దరికీ ఉన్న సంబంధాన్ని బయట ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం లేదు. ఎవర్నీ నమ్మించాల్సిన అవసరం అస్సల్లేదు. కేసీఆర్, మోదీ వాళ్ల అవసరాలకు అనుగుణంగా మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరా గాంధీ లాంటి ప్రధాని కావాలి. ప్రపంచంలో ఆమెను మించిన యోధురాలు లేరు. ఒక దేశాన్ని ఓడించిన ఘనత ఇందిరా గాంధీదే.

### పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ

మా ప్రభుత్వ పాలనపై ఇప్పటినుంచే చర్చ ఎందుకుంటుంది? ఎన్నికలకు ముందు చివరి ఆరు నెలలూ చర్చ జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు.. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమల్లో లేవు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కొత్త పథకాలు తీసుకొచ్చాం. తొలి ఏడాదిన్నర ప్రణాళికల రూపకల్పనకే సమయం పోయింది. ఇప్పుడు వాటిని సమీక్షిస్తున్నాం. పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం.

### ఓపికగా ఉంటే పదవులు వస్తాయి

మరో 20 ఏళ్లు నేను రాజకీయాల్లో ఉంటా. గత ప్రభుత్వంలో తప్పు చేసినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ వస్తోంది. కానీ, నేను అలా అరెస్టు చేయలేను. అన్నీ చట్టప్రకారమే జరుగుతాయి. నేను కేసీఆర్ లాగా చట్టాన్ని అతిక్రమించను. చట్టప్రకారమే నడుచుకుంటా. నేను ఒక మాట ఇచ్చానంటే.. అంతే అంకితభావంతో పనిచేస్తా. ఇచ్చిన మాటను అమలుచేసి తీరుతా.

# పేద విద్యార్థి చదువుకు ఆర్థిక సహాయం అందజేత

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : మానవతా దృక్పథంతో వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండాలని పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీ బ్లాక్ నెంబర్ 92 లో చిరు ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్న కరుణాకర్ కుమార్తె ఉషారాణి కి మల్లారెడ్డి కాలేజ్ లో ఎం.బి.ఎ సీట్ వచ్చింది అయితే తల్లితండ్రులు కాలేజ్, బస్ ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని స్థానిక నాయకులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకవచ్చారు. దీంతో కార్పొరేటర్ హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వారికి సమస్యను వివరించి తగిన సాయం చేయాలని కోరగా, హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వారు విద్యార్థినికి కాలేజ్, బస్ ఫిజు నిమిత్తం నలభై వేల రూపాయల చెక్ ను వివేకానంద నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే అరెకపూడి



గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ లు పాల్గొని విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా పీఏసీ ఛైర్మన్ గాంధీ మాట్లాడుతూ పేద విద్యార్థిని చదువుకు ఇబ్బంది రాకుండా ఆర్థిక సహాయం చేసిన హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకురాలు ఆలేఖ్య కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసారు. హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వారు గతంలో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. రానున్న రోజుల్లో కూడా సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగించాలని కోరారు. మానవతా దృక్పథంతో వారి కుటుం బానికి అన్ని విధాలుగా అండగా ఉండలనే ఉదేశ్యం తో వారి కుమార్తె చదువుకు ఎటువంటి ఆటంకం కల్గకూడదనే ఉద్దేశ్యంతో హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వారు చెల్లించడం జరిగినదని, వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటూ ఆ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ వారి జీవితాలలో వెలుగులు నింపడానికి నా వంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. పై చదువులకు ఆటంకం కల్గకుండా , మంచి గా చదువుకొని మంచి పేరు ప్రఖ్యాతులు సంపాందించుకుని ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. మంచి భవిష్యత్తు ను ఏర్పరచుకొని ఉన్నత లో స్థిరపడలని ఎమ్మెల్యే గాంధీ విద్యార్థి ఉషారాణి ని ఆశీర్వదించారు. ఎప్పుడు ఏ సహాయం కావల్సిన తన వంతు కృషి చేస్తానని విద్యార్థికి చెప్పడం జరిగింది.దీనికి విద్యార్థి , కుటుంబ సభ్యులు స్పందిస్తూ కళాశాల బస్సు ఫీజు కొరకు ఆర్థిక సహాయాన్ని అందించిన హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వారికి, ఎమ్మెల్యే కు, కార్పొరేటర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంచిగా చదువుకొని ,పది మందికి ఉపయోగపడేలా ఉంటానని ,నా పై చదువులకు ఆర్థిక సహాయాన్ని అందించిన వారిని జీవితం లో ఎప్పటికి మర్చిపోలేనని విద్యార్థిని చెప్పడం జరిగింది .ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, వాలి నాగేశ్వరరావు, మోజెస్, తిరుపతి, హోప్ ఆఫ్ హంగర్ సభ్యులు వెంకటేశ్వరావు, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చల్మిడి గ్రూప్ సంస్థల చైర్మన్ దంపతుల వివాహ దినోత్సవం వేడుకలు



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చెలిమిడి గ్రూప్ సంస్థల చైర్మన్ చల్మిడి వెంకటేష్ రేవతి దంపతుల వివాహ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం రాత్రి శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ గోత్రనామార్చనతో పూజలు జరిపి దంపతులకు వేద ఆశీర్వచనం చేసి విశేష వస్త్రాలతో సత్కరించారు. తీర్థప్రసాదాలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధి సేవ కమిటీ సభ్యులు ట్రస్టు సభ్యులు చెలిమిడి వెంకటేష్ రేవతి దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియాలో అధిక సంఖ్యలో శుభాకాంక్షలు చెప్పారు.

## కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడను కల్పించాలి

*** తహసిల్దార్ ఇంద్రకర్ అనిత**



రాజపేట, ప్రజా స్ఫూర్తి : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కోసం తాగునీరు వసతి, సేద తీరేందుకు నీడను ఏర్పాటు చేయాలని తాసిల్దార్ ఇంద్రకర్ అనిత ఆదేశించారు. సోమవారం రాజపేట మండలంలోని రేణిగుంట, నర్సాపురం, రాజాపేట గ్రామాల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. రైతులు విక్రయించిన ధాన్యం బస్తాలను దిగుమతి చేసుకునే రైస్ మిల్ ను సందర్శించి యాజమాన్యంతో మాట్లాడారు. తగు సూచనలు ఇచ్చారు. తహసిల్దార్ వెంట జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులున్నారు.

## చదువుల తల్లికి ప్రోత్సాహం:

*** ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో గల రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 2024 లో పదవ తరగతి చదివిన హిమబిందు ఆనాడు 8.2 జిపిఏ సాధించి పేరొందిన విద్యాసంస్థ అయిన తెలంగాణ గురుకుల సంస్థలో ఇంటర్మీడియట్లో ఎంపీసీ ఉచిత సీటును సాధించింది. తండ్రి సుతారి మేస్త్రి, ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 458/470 (97%) సాధించినందున హిమబిందును ప్రోత్సహిస్తూ రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ యం, ఎంఈఓ అయిన డాక్టర్ ప్రభుదయాల్ నూతన వస్త్రాలు, రాత పుస్తకాలు, క్యాష్ అవార్డును నేడు అందజేశారు. హిమబిందు తల్లికి సైతం చీరను బహుకరించారు. బీదరికం చదువుకు అడ్డంకి కాదనీ, చదివే బీదరికాన్ని తరిమేస్తుందని, విజేతగా నిలుపుతుందన్నారు. చదువే తలరాతను సైతం మార్చుతూ భవిష్యత్తును నిర్ణయిస్తుంది కావున చదువుపైనే విద్యార్థుల దృష్టి సారించాలన్నారు.

## తెలుగు విశ్వావసు నామ సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ జిల్లా : అన్వేషనేత్రం 2025 తెలుగు విశ్వావసు నామ సంవత్సర క్యాలెండర్ ను ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆఫీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికితీయడంలో అన్వేషనేత్రం పత్రిక ముందు అడుగులో ఉంటుందన్నారు. ప్రజా గొంతుకగా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలికితీస్తూ, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతూ నిష్పక్షపాతంగా, నిజాయితీగా, నిర్భయంగా సమస్యల పట్ల అవగాహనతో అవినీతి అక్రమాలను వెలికితీస్తున్న పత్రిక అన్వేషనేత్రం అని కొనియాడారు. ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కార్మిక కర్షక పక్షపాతిగా వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడే దినపత్రిక అన్వేషనేత్రం అన్నారు. అన్వేషనేత్రం



ఎడిటర్ సాల్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోళ్ళ రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజా అవసరాలను సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకుని కుల మతాలకు అతీతంగా నిత్యం పేద ప్రజల కోసం పోరాడుతున్న ప్రజా సేవకుడు ప్రజల మనిషి ఎమ్మెల్యే వేముల వీరేశం కు క్యాలెండర్ ఆవిష్కరించిన సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల నకిరేకంటి అంజయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నల్లబెల్లి యాదగిరి, నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు,శ్యామ్ కుమార్ ఐ.ఎన్టియూసి నాయకులు,సీత సంజీవ విద్యుత్ 327 నకిరేకల్ సబ్ డివిజన్ సెక్షన్ లీడర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని
## కృష్ణవేణి అభినందించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి,ప్రజాస్ఫూర్తి 28: ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి పూర్తిచేసి ఇటీవల విడుదలైన ఫలితాలలో 1000 మార్కులకు గాను 969 మార్కులు సాధించి టాపర్ గా నిలిచిన కృష్ణవేణి కీ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం అభినందించారు. సంగారెడ్డిలో నిరుపేద కుటుంబానికి చెందిన తండ్రి కృష్ణ వేణి ఇంటర్ ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కృష్ణవేణి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అభినందించి స్వీట్లు తినిపించి



శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కృష్ణవేణినీ కలెక్టర్ లేదా డాక్టర్ కావాలని సూచించారు.ఈ సందర్భంగా అక్షయ మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఫలితాలలో 977 మార్కులు రావడం సంతోషంగా ఉందన్నారు తనకు ఈ మార్కులు రావడానికి లెక్చరర్లు, ప్రిన్సిపల్ కృషి చేసినట్లు తెలిపారు. ఇంటి కి దూరంగా ఉన్న పట్టుదలతో చదువుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో డాక్టర్ కావాలని అనుకుంటున్నాట్లు ఎంబిబిఎస్ చదవడానికి ప్రభుత్వం కూడా సహకరిస్తే తప్పకుండా విజయం సాధిస్తానని తెలిపారు విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం

*** బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్**



ప్రజా స్ఫూర్తి, రాజపేట : రాజపేట మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం, గ్రామాల అభివృద్ధి కోసం టిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేయనుందని మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ అన్నారు. సోమవారం రాజపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్ లో జరిగిన 25వ, బిఆర్ఎస్ పార్టీ వార్షికోత్సవ సభకు రాజపేట మండలం నుండి అన్ని గ్రామాల నుండి స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో తరలివచ్చారని రాజపేట మండల తరపున కార్యక్రమ విజయవంతంలో భాగస్వామ్యం అయినందుకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, 15వ, ప్యాకేజీ ద్వారా రాజపేట మండలంలోని అన్ని గొలుసు కట్టు చెరువులను నీటితో నింపితే టిఆర్ఎస్ పక్షాన బీర్ల ఐలయ్యకు సన్మానం చేస్తామని మరొకసారి గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని తమకు సమస్యలను ప్రజలు పరిష్కారం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఎర్రగోకుల జస్వంత్, రాజపేట పట్టణ శాఖ అధ్యక్షులు బెడిద వీరేశం, రాజు తదితరులున్నారు. ఈ కార్యక్రమ విజయవంతం కోసం కృషి చేసిన రాజపేట మండలంలోని అన్ని గ్రామ శాఖ అధ్యక్షులకు, ప్రజాప్రతినిధులకు, మాజీ ప్రతినిధులకు, పెద్దలకు,పార్టీ ముఖ్య నాయకులకు, సట్టు తిరుమల్లేష్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఓనస్ రోబోటిక్ హాస్పటల్ ప్రారంభం

ఉప్పల్. ప్రజాస్ఫూర్తి : :ఓనస్ రోబోటిక్ హాస్పటల్ మూడవ శాఖను ఉప్పల్ లో సోమవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి,టిపీసిసి ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర రెడ్డి,పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట రెడ్డి,బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మాజీ కార్పొరేటర్లు పోచయ్య,బండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యుత్ షాక్ తో ఆవు మృతి



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 28 : జిన్నారం మండలం మాదారం గ్రామం శివారులో ఆవు ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌తో మృతి చెందింది. మాదారం గ్రామానికి చెందిన కుర్మ శ్రీశైలం సోమవారం ఎసం కుంట సమీపంలో పశువులను మేత కోసం తీసుకెళ్లాడు. కుంటలో పడిపోయిన విద్యుత్ స్తంభం వైపు ఆవు మేత మేసుకుంటూ వెళ్లి కరెంటు వైర్లను తాకడంతో అక్కడికక్కడే కరెంట్ షాక్‌తో మృతి చెందింది. బాధితుడు విద్యుత్, పశు వైద్యాధికారులకు సమాచారం ఇవ్వగా సంబంధిత అధికారులు వచ్చి పరిశీలించారు. తనకు ప్రభుత్వం న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

## మానవ సేవయే మాధవ సేవ అంటూ అనుక్షణం ప్రజల్లో నిలిచే నాయకుడు పిట్టల నాగరాజు



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు , మెదక్ ఎమ్మెల్యే రోహిత్ ఆదేశాల మేరకు సాయినాథపురంలో నివాసం ఉంటున్న ఒక నిరుపేద కుటుంబానికి చెందిన వజ్రమ్మ పోచయ్యల కన్నకూతురు రవళి అనే అమ్మాయికి మేనమామనై నా వొంతుగా మే 1న జరగనున్న పెళ్లి నిమిత్తం పెళ్లికానుకగా మైనంపల్లి హనుమంత్ రావు చేతుల మీదుగా పుస్తెమెట్టలు , పట్టుచీర అందించారు. ఒక పెళ్లికి అతిముఖ్యమైనవాటిలో ఒకటైనటువంటివి పుస్తె మెట్టలు అలాంటి వాటిని ఐదు కుటుంబాలకిచ్చే అదృష్టాన్ని ఆ దేవా దేవుడు నాకు కలిగించినందుకు సదా ఆయనకు కృతజ్ఞతుడైవుంటానన్నారు. మైనంపల్లి హనుమంతన్న అడుగుజాడల్లో నడుస్తున్న నాపై , ప్రతి నిరుపేద కుటుంభానికి అన్న ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పీఎన్ఆర్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామంలోకి ప్రవేశిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలి : డిఎస్పీ చంద్రభాను

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఆళ్లపల్లి పోలీసులు సోమవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గొత్తి కోయ గ్రామమైన బూస్రాయి గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఈ గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆ గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీస్ శాఖ తరపున అట్టి సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేసారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదీవాసీ ప్రజలకు విద్య,వైద్యం,రవాణా వంటి సౌకర్యాలను అందించడంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎల్లవేళలా ముందుంటారని,ఇతర శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ గ్రామంలోని యువత మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ సురేష్,ఆళ్ళపల్లి ఎస్సై సోమేశ్వర్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

# ఆక్యూపంక్చర్ థెరపీలో మరో ముందడుగు

* **సుగుణారావు కి పలువురి అభినందనలు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆక్యుపంచర్, అక్యూప్రెషర్ సైన్స్ ప్రాక్టీస్ లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రముఖ స్థానం సంపాదించుకున్న హీలర్. సుగుణా రావు మరో సర్టిఫికెట్ అందుకోవడంతో, ఆయనను పలువురు అభినందించారు. సికింద్రాబాద్లోని వెస్ట్ మారేడుపల్లి మహర్షి యోగ సెంటర్లో, ఆదివారం ప్రముఖ ఆక్యుపంచరిస్ట్, ట్రైనర్, డా.రవీందర్ రాజు ఆధ్వర్యంలోని స్పర్శ ఆక్యుపంక్చర్, ఆక్యుప్రస్సర్ , యోగ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన 'ఎక్స్ట్రా ఆర్డినరీ వెస్సెల్స్' (ఇ.ఒ.వి) కోర్సును పూర్తి చేసి సర్టిఫికెట్ అందుకున్న, కొత్తగూడానికి చెందిన ప్రముఖ హీలర్ జి.సుగుణారావును పలువురి అభినందనలు అందుకున్నారు. అభినందించిన వారిలో ప్రముఖ ప్రకృతి కవి, కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమ వ్యవస్థాపకులు జయరాజు, పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్య, స్టేప్ తెలంగాణ మేనేజర్ డా. బత్తుల కృష్ణయ్య, మన్ కి బాత్ మొక్కలరాజశేఖర్, నవభూమి పత్రిక స్టేట్ బ్యూరో తుమ్మలపల్లి ప్రసాద్, సింగరేణి రిటైర్డ్ జిఎం శనగ వెంకటేశ్వర్లు, ఎ .జి. ఎం గోనె శ్రీకాంత్, ఖైరో ప్రాక్టర్ కమలరాణి , కృతి ఆశ్రమం సభ్యులు కెహెచ్ ప్రసాద్, డాక్టర్ వెంకట్, సాగర్, శంకర్, రామవరం పరిరక్షణ సమితి అధ్యక్షులు మొహమ్మద్ ముస్తఫా, అంబేద్కరిస్ట్ తుంపురు శివ లు ఉన్నారు.ఈ కోర్సు ద్వారా ఒరిజినల్ ఛీ, రెంటల్ ఎనర్జీ, కిడ్నీ ఎనర్జీ, మింగ్ మెన్, ఇన్ వెజిల్స్, యాంగ్ వెజిల్స్, లోయర్ బ్యాక్ పెయిన్, నీ డయగ్నోసిస్, ఫింగర్ డయాగ్నోసిస్, టోనిఫికేషన్స్, సెడేషన్స్ ల పై ట్రీట్మెంట్స్ పద్ధతులను నేర్చుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపిన అందరికీ సుగుణ రావు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## విడతల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు: పొంగులేటి



ఎల్కతుర్తి: పటిష్ఠమైన భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తయారు చేసిందని, రైతులను ఇబ్బంది పెట్టకుండా సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి అధికారి కూడా రైతు కుటుంబం నుంచి వచ్చినవారే ఉంటారు. వారి కష్టాలు తెలుసు కాబట్టి వాళ్లను ఇబ్బంది పెట్టకుండా సమస్య పరిష్కరించాలి. ఈ ప్రభుత్వం 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలి విడతలో అత్యంత పేదవారికి ప్రాధాన్యత ఇస్తున్నాం. విడతల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం." అని అన్నారు.

## కేసీఆర్ 'డూప్లికేట్ గాంధీ' వ్యాఖ్యలపై జగ్గారెడ్డి ఫైర్

* **రాహుల్ గాంధీని విమర్శించే నైతిక అర్హత కేసీఆర్‌కు లేదన్న జగ్గారెడ్డి**
* **తెలంగాణ ఏర్పాటుకు గాంధీల చుట్టూ తిరిగిన గతం గుర్తుంచుకోవాలని హితవు**
* **కేసీఆర్ తన గౌరవాన్ని తగ్గించుకోవద్దని సూచన**



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, గాంధీ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలపై పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్ తన గతాన్ని పూర్తిగా మర్చిపోయి మాట్లాడుతున్నారని, రాహుల్ గాంధీని విమర్శించే నైతిక అర్హత ఆయనకు లేదని జగ్గారెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సభలో గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి కేసీఆర్ 'డూప్లికేట్ గాంధీలు' అని చేసిన వ్యాఖ్యలపై జగ్గారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "కేసీఆర్ వయసులో పెద్దవారు. మాట్లాడేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలి. రాహుల్ గాంధీ కుటుంబానికి దేశంలో ఓ ప్రత్యేక చరిత్ర ఉంది. వారిపై విమర్శలు చేసి కేసీఆర్ తనకున్న కొద్దిపాటి గౌరవాన్ని కూడా పోగొట్టుకోవద్దు" అని జగ్గారెడ్డి హితవు పలికారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం గతంలో కేసీఆర్ చేసిన ప్రయత్నాలను ఈ సందర్భంగా జగ్గారెడ్డి గుర్తుచేశారు. "ప్రత్యేక రాష్ట్రం కోసం సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇళ్ల చుట్టూ తిరిగిన రోజులు కేసీఆర్ మర్చిపోయారా? వారి అపాయింట్‌మెంట్ కోసం నెలల తరబడి ఢిల్లీలో పడిగాపులు కాసిన సంగతి గుర్తులేదా? రాష్ట్ర విభజనకు ముందు వారు ఒరిజినల్ గాంధీలు, ఇప్పుడు డూప్లికేట్ గాంధీలు అయ్యారా? ఇదేనా కేసీఆర్ రాజకీయ విలువలు?" అని జగ్గారెడ్డి ఘాటుగా ప్రశ్నించారు. రాజకీయాల్లో ప్రజల పక్షాన నిలిచే హీరో పాత్రను, ప్రజా వ్యతిరేక శక్తుల పాలిట విలన్ పాత్రను కాంగ్రెస్ పార్టీనే పోషిస్తుందని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగవని, రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని సూచించారు.

## తెలంగాణకు తీరని అన్యాయం చేసింది కేసీఆరే: ఉత్తమ్



నల్గొండ: కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. నల్గొండ కలెక్టరేట్ లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు. "గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలి. రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకాన్ని సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ వరకు పొడిగిస్తాం. పూడిక వల్ల ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్ 2 పనులను పూర్తి చేస్తే.. ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటి సమస్య తీరుతుంది. సాగునీటి రంగంలో 1.81 లక్షల కోట్లు ఖర్చుచేసి, భారాస నేతలు జేబులు నింపుకొన్నారు. భారాస నేతల కమీషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి.. అప్పులు చేసి కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు ఖర్చు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకొని రాష్ట్రానికి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కానీ, తెలంగాణకే 500 టీఎంసీలు కేటాయించాలని ఈ ప్రభుత్వం పోరాడుతోంది" అని ఉత్తమ్ అన్నారు.

## సీఎస్ శాంతి కుమారికి కీలక బాధ్యతలను అప్పగించిన తెలంగాణ ప్రభుత్వం

* **ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న శాంతి కుమారి**
* **మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వైస్ ఛైర్మన్‌గా నియామకం**
* **కొత్త సీఎస్ గా కె. రామకృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వ నిర్ణయం**



తెలంగాణ సీఎస్ శాంతి కుమారి ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోవైపు, పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత సీఎస్ శాంతి కుమారికి ప్రభుత్వం కీలక బాధ్యతలను అప్పగించింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) వైస్ ఛైర్మన్‌గా ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీఎస్ పదవి నుంచి వైదొలగిన తర్వాత ఆమె ఈ నూతన బాధ్యతలను చేపట్టనున్నారు. దీంతో పాటు, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ (డీజీ)గా కూడా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు, 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. నూతన సీఎస్ ఎంపికపై గత కొంతకాలంగా ప్రభుత్వం కసరత్తు చేసింది. సీనియారిటీ జాబితా ప్రకారం పలువురు అధికారుల పేర్లను పరిశీలించిన అనంతరం, రామకృష్ణారావు సమర్థత, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

## లిఫ్ట్ లో దారుణ హత్య.. హైదరాబాద్ లో ఘోరం




హైదరాబాద్ లోని హిమాయత్ నగర్ లో దారుణం చోటుచేసుకుంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ హిమాయత్ నగర్ బ్రాంచ్ భవనంలో గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. హంతకులు మృతదేహాన్ని బిల్డింగ్ లిఫ్ట్ లో వదిలి పరారయ్యారు. ఉదయం బ్యాంకుకు చేరుకున్న సిబ్బంది లిఫ్ట్ లో మృతదేహం కనిపించడంతో భయాందోళనలకు లోనయ్యారు. బ్యాంకు సిబ్బంది సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించారు. పోస్ట్ మార్టం కోసం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు.. అత్యంత కిరాతకంగా జరిగిన ఈ హత్యకు పాత కక్షలే కారణం కావొచ్చని భావిస్తున్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు, హంతకుల ఆచూకీ కోసం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

## జానారెడ్డితో రేవంత్ రెడ్డి కీలక సమావేశం





తెలంగాణలో మావోయిస్టులతో శాంతి చర్చల పునరుద్ధరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉదయం కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డితో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులతో చర్చలు జరిగినప్పుడు హోంమంత్రిగా పనిచేసిన జానారెడ్డి అనుభవాన్ని ఈ సందర్భంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రక్రియకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. శాంతి చర్చల కమిటీ ప్రతినిధులతో ఆదివారం జరిగిన సమావేశంలోనే జానారెడ్డి సలహాలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే తాజా భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో శాంతి చర్చల సమయంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్‌గా ఉన్న దిగ్విజయ్ సింగ్‌తో కూడా సీఎం రేవంత్ ఫోన్‌లో సంప్రదింపులు జరిపారు. మావోయిస్టుల సమస్యను కేవలం శాంతిభద్రతల సమస్యగా కాకుండా సామాజిక సమస్యగా పరిగణిస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా అడుగులు చర్చల ప్రక్రియకు మార్గం సుగమం చేస్తాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పాతబస్తీలో ఈడీ సోదాలు




హైదరాబాద్: పాతబస్తీలోని యాకుత్‌పురా, సంతోష్‌నగర్‌లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. భూదాన్ భూముల వ్యవహారంలో ఈ తనిఖీలు చేపట్టారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఈఐపీఎల్ కంపెనీ భూములు విక్రయించింది. ఈఐపీఎల్ కంపెనీకి సుకూర్ బినామీగా ఉన్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈక్రమంలో సుకూర్, అతడి బంధువు షర్ఫన్, మరో ఇద్దరి ఇళ్లలో సోదాలు జరిపింది. ఇప్పటికే ఈ కేసులో అప్పటి రంగారెడ్డి కలెక్టర్ అమోయ్‌కుమార్, మహేశ్వరం తహసీల్దార్‌ను ఈడీ విచారించింది.



# వేడుక ముచ్చట... గోళ్లపైనా!

పెళ్లి వేడుకలో వధూవరులిద్దరికీ సమప్రాధాన్యమైనా... కాస్త ఎక్కువ ఆకర్షణ మాత్రం అమ్మాయిదే కదూ! దుస్తుల దగ్గర్నుంచి నగలు, అలంకరణ...ఆమె చుట్టూనే వచ్చిన వాళ్ల సంభాషణంతా తిరుగుతుంది. అందుకే పిక్చర్ పర్‌ఫెక్ట్‌గా ఉండాలని తపిస్తున్నారు నేటితరం పెళ్లికూతుళ్లు. అసలే చుట్టూ కెమెరాలు... వధువు అలంకరణ దగ్గర్నుంచే షూటింగ్‌లు మొదలుపెడుతున్న రోజులు... ప్రతి చిన్న అంశమూ మధురానుభూతే. అందుకే తల నుంచి గోటివరకు ప్రతి చిన్న అంశాన్నీ ఫొటో రూపంలో భద్రపరచాలనుకుంటున్నారు. అలాంటప్పుడు గోళ్లను మాత్రం ఒకే రంగుతో ఎలా వదిలేయగలరు? అందుకే మేకప్, దుస్తులు, నగలు, మెహందీల్లానే గోళ్లపైనా ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు నేటి వధువులు. 'పెళ్లికూతురినయ్యానోచ్' అంటూ గోళ్లపైనా ఆ వివరాలను నెయిల్‌పాలిష్‌తో చిత్రాల్లా చెక్కించేస్తున్నారు. వధువరుల చిత్రాలు, సప్తపది, అగ్నిసాక్షి, ఓంకారం... ఇలా ఎన్నింటికో వాటిలో చోటిచ్చేస్తున్నారు. నెయిల్ ఆర్టిస్ట్‌లకు పనిచెబుతున్నారు. వీటన్నింటికీ సమయం పడుతుంది కదా! అంతసేపు కూర్చోలేం బాబు అనిపించినవాళ్లు నెయిల్ ఎక్స్‌టెన్షన్లను డిజైన్ చేయించుకుంటున్నారు. ఆఖరి సమయంలో గోళ్లకు అంటించేసుకోవడమే! జెల్, మ్యాటీ, అక్రిలిక్... ఎంచుకోవడానికీ బోలెడు నెయిల్ పాలిష్ రకాలు. ఇక జోడించే ముత్యాలు, రాళ్ల ధగధగలూ సరేసరి. మీరూ ఓసారి చూసేయండి. మనసు పారేసుకున్నారా? మీదైన రోజున ప్రయత్నించేయండి మరి!



















# అదరహో అనిపించిన ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీం టేస్టింగ్ ఛాలెంజ్

* **చిన్నా, పెద్దా తేడా లేకుండా కళ్లకు గంతలు కట్టుకుని ఐస్ క్రీం టేస్ట్ చేసి ఫ్లేవర్స్ చెప్పిన పోటీదారులు**
* **ముఖ్య అతిథులుగా హాజరైన నటి, నిర్మాత సుమయా రెడ్డి & డాక్టర్ ప్రీతి రెడ్డి**
* **హై బిజ్ టీవీ & ఐస్ బర్గ్ ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ ఆధ్వర్యంలో జరిగిన ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీం టేస్టింగ్ ఛాలెంజ్**

హైదరాబాద్, 2025 ఏప్రిల్ 27 ప్రజా స్ఫూర్తి : ఐస్ క్రీమ్ లవర్స్ అంతా ఒక్క చోట చేరారు. కళ్ళకు గంతలు కట్టుకుని ఐస్ క్రీమ్ రుచి చూసి.. దాని ఫ్లేవర్ చెప్పేందుకు పోటీ పడ్డారు. దీంతో, హైదరాబాద్ ఎర్రమంజిల్ లోని నెక్స్ట్ ప్రీమియా మాల్ సందడిగా మారింది. హై బిజ్ టీవీ & ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ ఆధ్వర్యంలో జరిగిన ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీం టేస్టింగ్ ఛాలెంజ్ లో ఈ దృశ్యం కనిపించింది. పోటీదారులు, వీక్షకులు కలిపి 1000 మందికి పైగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. హై బిజ్ టీవీ గతంలో ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీం టేస్టింగ్ ఛాలెంజ్ రెండు ఎడిషన్లను దిగ్విజయంగా చేపట్టింది. ఈ సారి మూడో ఎడిషన్ కూ అద్భుత ఆదరణ లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నటి, నిర్మాత సుమయా రెడ్డి, డాక్టర్ ప్రీతి రెడ్డి (వైస్ ఛైర్ పర్సన్ మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్) హాజరయ్యారు. ప్రముఖ ఆర్జే శేఖర్ బాషా.. నటి, బిగ్ బాస్ 5 కాంటెస్టెంట్ శ్వేతా వర్మ, ఎం. రాజ్ గోపాల్ (మేనేజింగ్ డైరెక్టర్ హై బిజ్ టీవీ & తెలుగు నౌ), డాక్టర్ జె. సంధ్యారాణి (మేనేజింగ్ డైరెక్టర్ హై బిజ్ టీవీ ఎల్.ఎల్.పి) తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

**విజేతల వివరాలు:**




* లక్ష రూపాయల క్యాష్ ప్రైజ్: శృతి
* 50 వేల రూపాయల క్యాష్ ప్రైజ్: విధాత్రి
* 25 వేల రూపాయల క్యాష్ ప్రైజ్: యశస్వి
* వీరితో పాటు 25 మంది లక్కీ డ్రా విజేతలను కూడా ఎంపిక చేసి బహుమతులు ఇచ్చారు.

ఐస్ క్రీం అనేది లైఫ్ లో బెస్ట్ పార్ట్ అని డాక్టర్ ప్రీతి రెడ్డి తెలిపారు. సంతోషంలో ఉన్నా.. ఎంజాయ్ చేయాలనుకున్నా ఐస్ క్రీం అందుకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. దీన్ని తినేందుకు ప్రత్యేకమైన కారణాలు అక్కర్లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల్లో ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగిందని తెలిపారు. అలాంటి వారికి ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ చాలా నచ్చుతాయని చెప్పారు. ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీం టేస్టింగ్ ఛాలెంజ్ ను నిర్వహించిన హై బిజ్ టీవీ & ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ ను అభినందించారు. ఐస్ క్రీం టేస్టింగ్ ఛాలెంజ్ ఈవెంట్ ఆద్యంతం ఉల్లాసంగా సాగింది. వెన్యూలో ఐస్ క్రీం స్టాల్స్ తో పాటుగా ఫుడ్ కోర్ట్స్ ఏర్పాటు చేశారు. ఈవెంట్ కు వచ్చిన వారికి అక్కడ కావాల్సినంత వినోదం దొరికింది. కుటుంబంతో సరదాగా ఒకరోజు గడిపేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడింది. ఐస్ క్రీం టేస్టింగ్ ఛాలెంజ్ అద్భుతంగా ఉందని హాజరైన కాంటెస్టెంట్స్ చెప్పారు. కళ్లకు గంతలు కట్టుకుని ఐస్ క్రీం టేస్ట్ చేసి ఫ్లేవర్ చెప్పడం కొత్తగా అనిపించిందని తెలిపారు. వినూత్న కార్యక్రమాల నిర్వహణలో హై బిజ్ టీవీ ఎప్పుడూ ముందుంటుందని కొనియాడారు. భవిష్యత్ లో ఇలాంటి మరిన్ని ఈవెంట్స్ నిర్వహించాలని కోరారు.

# సిద్ధరామయ్య.. పోలీసు అధికారిపై దురుసు ప్రవర్తన

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరో వివాదంలో చిక్కు కున్నారు. పాక్‌తో యుద్ధం వద్దంటూ చేసిన వ్యాఖ్యలతో ఇటీవల వార్తలకెక్కిన ఆయన.. తాజాగా ఓ పోలీసు అధికారిపై దురుసుగా ప్రవర్తించి మరోసారి వార్తల్లో నిలిచారు. తాను ప్రసంగించబోయే సభా ప్రాంగణం వద్ద గందరగోళం ఏర్పడడంతో సహనం కోల్పోయిన ఆయన.. పోలీసు అధికారిపై చేయి చేసుకోబోయారు. దీంతో సిద్ధరామయ్య చర్యను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. బెళగావిలో సోమవారం జరిగిన బహి రంగ సభలో సిద్ధరామయ్య పాల్గొన్నారు. తాను ప్రసంగించబోయే సమయంలో ప్రాంగణంలో భాజపా మహిళా మోర్చా సభ్యులు నల్ల



జెండాలతో సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. తన ప్రసంగానికి ఆటంకం కలిగిస్తుండటంతో సభా బాధ్యతలను చూస్తున్న పోలీసు అధికారి ఏఎస్పీ భరమ ణిని పిలిచి సీఎం మందలించారు. ఈ క్రమంలోనే సహనం కోల్పోయి చేయి ఎత్తి.. అంతలోనే వెనక్కి తగ్గారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో జేడీఎస్ ఎక్స్‌లో పోస్టు చేసింది. పోలీసు అధికారితో సీఎం వ్యవహరించిన తీరును తప్పుబట్టింది. "మీ అధికారం కేవలం ఐదేళ్లే. ప్రభుత్వ ఆధికారి 60 ఏళ్లు పాటు సేవలందిస్తారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని గుర్తుంచుకోండి" అంటూ పోస్ట్ చేసింది. పోలీసు అధికారి పట్ల దురుసుగా వ్యవహరించినందుకు ఆయనకు క్షమాపణ చెప్పాలని భాజపా డిమాండ్ చేసింది. పాకిస్థాన్‌తో యుద్ధం వద్దంటూ శనివారం సిద్ధ రామయ్య చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో దానిపై ఆదివారం వివరణ ఇచ్చారు. యుద్ధమే వద్దని తాను అనలేదన్నారు. యుద్ధం కన్నా ముందు నిఘాను బలోపేతం చేసుకోవాలని, ఉగ్రవాదులను నిర్మూలించాలని మాత్రమే సూచించానని గుర్తు చేశారు. తన వ్యాఖ్యలను భాజపా వక్రీకరించి ప్రచారం చేస్తోందన్నారు.



## తహవ్వుర్ రాణా
# ఎన్ఐఏ కస్టడీ పొడిగింపు

ముంబయి ఉగ్రదాడి కేసులో ప్రధాన సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణా ఎన్ఐఏ కస్టడీని సోమవారం దిల్లీ కోర్టు పొడిగించింది. దాంతో మరో 12 రోజులు అతడు దర్యాప్తు సంస్థ కస్టడీలో ఉండనున్నాడు. ఇదివరకు విధించిన 18 రోజుల కస్టడీ గడువు ముగియడంతో ఈ రోజు రాణాను కోర్టుముందు హాజరు పర్చారు. అతడి ముఖం కనిపించకుండా కవర్ చేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ న్యాయస్థానానికి తీసుకువచ్చారు. ఎన్ఐఏ అదుపులో ఉన్న రాణాను ఇటీవల ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు విచారించారు. ఈ విచారణకు అతడు సహకరించకుండా.. తప్పించుకునే రీతిలో సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. ముంబయి ఉగ్రదాడులతో తనకు ఎలాంటి సంబంధం లేదని విచారణలో భాగంగా రాణా వెల్లడించినట్లు తెలుస్తోంది. తహవ్వుర్ రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. 26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారి. ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నాడన్న ఆరోపణలపై 2009లో అరెస్టయ్యాడు. అమెరికా జైల్లో శిక్ష అనుభవించిన అతడిని అప్పగింత ప్రక్రియలో భాగంగా భారత్‌కు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. 2008 నవంబర్ 26న 10 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారా ముంబయికి చేరుకుని.. సీఎస్ఎంటీ, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారు. నవంబర్ 29 వరకు మారణహోమం కొనసాగింది. ఈ ఘటనల్లో 18 మంది భద్రత సిబ్బంది సహా 166 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. అప్పటి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) చీఫ్ హేమంత్ కర్కరే, ఆర్మీ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్, ముంబయి అదనపు పోలీస్ కమిషనర్ అశోక్ కామ్టే, సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయ్ సలాస్కర్‌లు అమరులయ్యారు.

## పాక్ గుండెల్లో గుబులు..
# ఉగ్రవాదులను తరలిస్తున్న దాయాది సైన్యం?

పహల్గాం ఉగ్రదాడితో భారత్ పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెల కొన్నాయి. భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది. భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుతా, కొట్లి వంటి పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి. వీటిలో 150



నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాయి. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.

## పహల్గాం ఉగ్రదాడి ఘటన..
# పార్లమెంట్ ప్రాంగణంలో కీలక భేటీ

పహల్గాం ఉగ్రదాడితో దేశమంతా దిగ్భ్రాంతికి గురైంది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాదికి గుణపాఠం చెప్పేందుకు భారత్ సిద్ధమవుతోంది. ఈ తరుణంలో పలు కీలక భేటీలు జరుగుతున్నాయి. తాజాగా పార్లమెంట్ ప్రాంగణంలో రక్షణ వ్యవహారాలపై స్టాండింగ్ కమిటీ సమావేశమైంది. దీనికి ఎంపీలు రాధా మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, విష్ణుపాల్ రే, జగన్నాథ్ సర్కార్, శక్తి సింగ్ గోహిల్, సంజయ్ సింగ్ తదితరులు హాజరయ్యారు. ఈరోజు ఉదయం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ భేటీ అయ్యారు. పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. దీనికిముందు భారత్ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు రాజ్‌నాథ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఆదివారం భేటీ అయ్యారు. ఆ సమావేశంలో మన సైన్యం కొన్ని కీలక



నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను రక్షణమంత్రి నేడు ప్రధానికి వివరించారు. మోదీతో భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్ కూడా పాల్గొన్నారు. ఉగ్రదాడి తర్వాత కేంద్రం అఖిలపక్ష భేటీ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన వెనుక భద్రతా వైఫల్యం ఉందని, దాడి జరిగిన వెంటనే ప్రభుత్వం సరిగా స్పందించలేదని విపక్షాలు వ్యాఖ్యానించాయి. దాడి జరిగిన సమయంలో భద్రతా బలగాలు, సీఆర్పీఎఫ్ ఎక్కడున్నాయి? అని పలు నేతలు ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం తరఫు నుంచి ఓ కేంద్రమంత్రి బదులిస్తూ.. "సాధారణంగా జూన్ నుంచి ప్రారంభమయ్యే అమర్‌నాథ్ యాత్ర వరకు ఈ లోయ వద్దకు పర్యాటకులు వెళ్లకుండా ఆంక్షలు అమల్లో ఉంటాయి. కానీ, ఈసారి భద్రతా ఏజెన్సీలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే స్థానిక అధికారులు బైసరన్‌కు పర్యాటకులను అనుమతించారు" అని పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ స్పందనపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. వేల మంది టూరిస్టులు అక్కడకు వెళ్తుంటే.. ప్రభుత్వానికి తెలియకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించినట్లు వార్తలు వచ్చాయి.

# భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

## వెయ్యి పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. గత సెషన్‌లో సూచీలు పహల్గాంలో ఉగ్రవాదుల దాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య పెరిగిన ఉద్రిక్తల కారణంగా మార్కెట్లు పతనమయ్యాయి. అయితే, వారంలో తొలిరోజైన సోమవారం లాభాల్లో ప్రారంభమయ్యాయి. విదేశీ పెట్టుబడులు కొనసాగడం.. బ్లూ చిప్ స్టాక్స్ రాణించడంతో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ సెన్సెక్స్ 79,343.63 పాయింట్ల లాభాల్లో మొదలైంది. ఏ దశలోనూ మళ్లీ వెనక్కి తగ్గకుండా వరుస సెషన్లలో లాభాల్లో ట్రేడయ్యింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 80,321.88 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 1,005.84 పాయింట్ల లాభంతో 80,218.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 272.90 పాయింట్లు పెరిగి.. 24,312.25 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,877 షేర్లు లాభపడ్డాయి. మరో 1,961 షేర్లు పతనయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ లైఫ్, భారత్ ఎలక్ట్రానిక్స్, సన్ ఫార్మా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అత్యధికంగా లాభపడ్డాయి. శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌యూఎల్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.3 శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగింది. ఐటీ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు మెటల్, రియాల్టీ, ఆయిల్, గ్యాస్, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ ఒకటి నుంచి 3శాతం పెరిగాయి.

## పసిడి కొనేవారికి అదిరిపోయే వార్త..!



**న్యూఢిల్లీ:** బంగారం ధరలు కొనుగోలుదారులకు భారీ ఊరటనిచ్చాయి. ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడంతో బంగారం ధర భారీగా పతనమైంది. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో సోమవారం పసిడి ధర రూ.1000 తగ్గి తులానికి రూ.98,400 చేరింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం.. 99.9 ప్యూరిటీ గోల్డ్ గురువారం పది గ్రాముల ధర రూ.99,400 వద్ద ముగిసింది. ఇక 99.5 ప్యూరిటీ గోల్డ్ సైతం రూ.1000 పతనమై తులానికి రూ.97,900కి చేరింది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా పెట్టుబడిదారులు రిస్క్ తీసుకునేందుకు ఆసక్తి చూపించారు.

దాంతో బంగారం ఆస్తులకు డిమాండ్ తగ్గించింది. డాలర్ బలపడిన నేపథ్యంలో బంగారంపై ఒత్తిడి పెరిగింది. ఫలితంగా ధరలు తగ్గుతున్నాయని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. చైనా 125 శాతం సుంకాల నుంచి యూఎస్ దిగుమతులను మినహాయించనున్నట్లు ప్రకటించింది. అయితే, అధికారిక వాణిజ్య చర్చల జరుగుతున్నాయన్న వార్తలను తిరస్కరించింది. అయితే, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధం భయాల నేపథ్యంలో పెట్టుబడిదారులు బంగారంపై మరిన్ని పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా పేర్కొన్నారు. ప్రధాన శక్తుల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, భారతదేశం-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారానికి డిమాండ్ పెరుగుతుందని అంచనా వేశారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా వ్యాపారులు నిరసన వ్యక్తం చేయడంతో శుక్రవారం స్థానిక బులియన్ మార్కెట్లు మూతపడ్డాయి. మరో వైపు సోమవారం వెండి ధర రూ.1400 తగ్గి.. కిలో ధర రూ.98,500కి చేరింది. ప్రపంచవ్యాప్తంగా స్పాట్ బంగారం దాదాపు ఒక శాతం తగ్గి ఔన్సుకు 3,291.04 డాలర్లకు చేరుకుంది. ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ విశ్లేషకుడు వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది మాట్లాడుతూ అమెరికా అనేక దేశాలతో సుంకాలపై చర్చలు ప్రారంభించడం, చైనా-యూఎస్ మధ్య వాణిజ్య ఒప్పందం జరుగుతుందన్న అంచనాలు పెరుగుతున్న నేపథ్యంలో బంగారానికి డిమాండ్ తగ్గుతున్నది. అంతేకాకుండా, రష్యా-ఉక్రెయిన్ శాంతి ఒప్పందంపై నేపథ్యంలోనే డిమాండ్ పడిపోతున్నది. ఆసియా మార్కెట్లో స్పాట్ వెండి 0.2 శాతం తగ్గి ఔన్సుకు 33.05 వద్ద ట్రేడవుతున్నది.

## యూట్యూబ్ భారత్ మేనేజింగ్ డైరెక్టర్ గుంజన్ సోనీ..



**న్యూఢిల్లీ:** ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ దిగ్గజం యూట్యూబ్ కంపెనీ భారత దేశం మేనేజింగ్ డైరెక్టర్‌గా గుంజన్ సోనీని నియమించినట్లుగా సోమవారం వెల్లడించింది. బిజినెస్, టెక్నాలజీ, మార్కెటింగ్, ఈ-కామర్స్ రంగాల్లో రెండు దశాబ్దాలకుపైగా అనుభవం ఉన్న ఆమె భారత్‌లో యూట్యూబ్ వృద్ధి, ఆవిష్కరణ ప్రయత్నాలకు బాధ్యత వహించబోతున్నట్లుగా ఆల్ఫాబెట్ యాజమాన్యంలోని వీడియో ప్లాట్‌ఫామ్ ప్రకటించింది. ఈ సందర్భంగా యూట్యూబ్ ఆసియా పసిఫిక్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ ఆనంద్ మాట్లాడుతూ.. భారత్‌లో యూట్యూబ్ ప్రయాణం ఎంతో ఉత్సాహంగా, శక్తివంతంగా సాగుతోందన్నారు.

అపారమైన సృజనాత్మకత, సామర్థ్యం ఉన్న దేశం భారత్ అన్న ఆయన.. అపారమైన అనుభవం ఉన్న గుంజన్‌కు స్వాగతం పలుకుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. క్రియేటర్ ఎకానమీ, భారతదేశ వీడియో కామర్స్ రంగంపై ఆమెకున్న లోతైన అవగాహన, నాయకత్వ పటిమతో క్రియేటర్ల వృద్ధిని వేగవంతం చేసేందుకు, కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడం, వినియోగదారులను ఆకట్టుకునేందుకు, డిజిటల్ ఇండియా ప్రయాణానికి మరింత తోడ్పాటునందించేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుంజన్ సోనీ మాట్లాడుతూ.. యూట్యూబ్‌లో చేరడం గౌరవంగా భావిస్తున్నానని.. అదే సమయంలో ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా క్రియేటర్లను యూట్యూబ్ శక్తివంతం చేస్తున్న తీరు, కమ్యూనిటీలను కలుపుతున్న విధానం స్ఫూర్తిదాయకమని.. ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ క్రియేటర్లకు కొత్త అవకాశాలను అందించడంలో, ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకునేలా యూట్యూబ్ పాత్రను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని గుంజన్ పేర్కొన్నారు.

ఆమె గతంలో సింగపూర్ కేంద్రంగా పని చేసిన జలోరాలో గుంజన్ గతంలో జలోరా, స్టార్ ఇండియా, మింత్రాలో సేవలందించారు. సింగపూర్ కేంద్రంగా పనిచేసిన జలోరా గ్రూప్‌కు ఆరేళ్లపాటు సీఈఓగా పని చేశారు. అక్కడ ఆమె కొత్త కేటగిరీలు, వ్యాపార నమూనాలను పరిచయం చేయడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు. అంతకు ముందు ఆమె స్టార్ ఇండియాలో ఈవీపీగా, మింత్రాలో సీఎంఓగానూ సేవలందించారు. పనిచేశారు. మెకిన్సీలో కన్స్యూమర్ అండ్ మార్కెటింగ్ విభాగంలో భాగస్వామిగా వ్యవహరించారు.



# వైభవ్ విధ్వంసక శతకం..

### గుజరాత్‌ను చిత్తుగా ఓడించిన రాజస్థాన్



**జైపూర్ :** ఐపీఎల్ 18వ సీజన్ ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన రాజస్థాన్ రాయల్స్ భారీ విజయం సాధించింది. 210 పరుగుల లక్ష్యాన్ని 15.5 ఓవర్లలోనే ఛేదించింది. 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(101) విధ్వంసక సెంచరీతో కదంతొక్కగా.. యశస్వీ జైస్వల్(70 నాటౌట్) సూపర్ హాఫ్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. తొలి వికెట్‌కు 166 రన్స్ జోడించి రాజస్థాన్ విజయానికి పునాది వేశారిద్దరు. వైభవ్ ఔటయ్యాక రియాన్ పరాగ్(32 నాటౌట్) ధనాధన్ ఆడి లాంఛనం ముగించాడు. దాంతో, 18వ ఎడిషన్‌లో మూడో విజయం సాధించిన రాజస్థాన్ పాయింట్ల పట్టికలో సన్‌రైజర్స్‌ను కిందికి నెట్టేసి 8వ స్థానానికి ఎగబాకింది.

ఐపీఎల్ చరిత్రలో రాజస్థాన్ రాయల్స్‌కు కలకాలం గుర్తిండిపోయే రోజు ఇది. రికార్డు పుస్తకాల్లో 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ(101) పేరు నిక్షిప్తమైంది. గుజరాత్ టైటాన్స్ బౌలర్లను ఉతికారేస్తూ సిక్సర్లతో రెచ్చిపోయిన ఈ చిచ్చరపిడుగు మెరుపు శతకంతో చెలరేగాడు. దాంతో, రాజస్థాన్ కొండంత లక్ష్యాన్ని అలవోకగా కరిగించి 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది.గుజరాత్ నిర్దేశించిన 210 పరుగుల ఛేదనలో రాజస్థాన్ ఓపెనర్లు దూకుడుగా ఆడారు. జోస్ బట్లర్ క్యాచ్ వదిలేయడంతో 2 పరుగులు వద్ద యశస్వీ జైస్వాల్(31)కు లైఫ్ లభించింది. తొలి మ్యాచ్‌లోనే ఆకట్టుకున్న వైభవ్.. సిరాజ్ వేసిన మొదటి ఓవర్లో సిక్సర్ బాదేశాడు. ఆ తర్వాత ఇషాంత్‌కు చుక్కలు చూపిస్తూ.. వరుసగా 6, 6, 4.. ఆ తర్వాత 6, 4 బాదాడు. వాషింగ్టన్ సుందర్ వేసిన 4వ ఓవర్లో 6, 6, 4 కొట్టి ఐపీఎల్‌లో తొలి అర్ధ శతకం సాధించాడీ 14 ఏళ్ల కుర్రాడు.

### 35 బంతుల్లో సెంచరీ

అర్ధ శతకం తర్వాత కూడా వైభవ్ జోరు తగ్గించలేదు. ఇషాంత్, సుందర్, రషీద్.. బౌలర్ మారినా బంతి గమ్యం స్టాండ్‌లోకే అన్నట్టు ఆడాడీ యువకెరటం. రషీద్ ఖాన్ బౌలింగ్‌లో సిక్సర్‌తో సెంచరీకి చేరువయ్యాడు. ఐపీఎల్‌లో వంద కొట్టిన పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. 35 బంతుల్లోనే శతకం బాదేసిన వైభవ్.. ఈ లీగ్ చరిత్రలోనే రెండో వేగవంతమైన సెంచరీ సాధించాడు.అయితే.. ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో పెద్ద షాట్‌కు యత్నించి వైభవ్ బౌల్డ్ అయ్యాడు. అప్పటికే రాజస్థాన్ 166 పరుగులు చేసి గెలుపు వాకిట నిలిచింది. ఆ తర్వాత వచ్చిన నితీశ్ రానా(4)ను రషీద్ ఎల్బీగా వెనక్కి పంపాడు. సాయి కిశోర్ బౌలింగ్‌లో4, 6, 4 బాదిన కెప్టెన్ రియాన్ పరాగ్(32 నాటౌట్) 16 రన్స్ పిండుకున్నాడు. సుందర్ వేసిన 16వ ఓవర్ మూడో బంతిని స్టాండ్స్‌లోకి పంపిన పరాగ్ జట్టుకు 8 వికెట్ల విజయాన్ని అందించాడు.

### గిల్, బట్లర్ మెరుపులతో

జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు తేలిపోయారు. గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు చెలరేగగా భారీగా పరుగులిచ్చారు. టాస్ ఓడిన గుజరాత్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(84), సాయి సుదర్శన్(39) ఎప్పటిలానే శుభారంభం ఇచ్చారు. పవర్ ప్లేలో రాజస్థాన్ బౌలర్లను చీల్చి చెండాడుతూ స్కోర్ బోర్డును ఉరికించారు. దాంతో, గుజరాత్ పవర్ ప్లేలో వికెట్ కోల్పోకుండా 53 పరుగులు చేసింది. 6వ ఓవర్ తర్వాత జోరు పెంచిన గిల్ హసరంగ ఓవర్లో సింగిల్ తీసి అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో సుదర్శన్ సైతం దంచేయగసాగాడు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ఎట్టకేలకు థీక్షణ విడదీశాడు. అతడి బౌలింగ్‌లో సుదర్శన్ పెద్ద షాట్ ఆడబోగా.. రియాన్ పరాగ్ క్యాచ్ సూపర్‌గా అందుకున్నాడు. దాంతో, 93 వద్ద గుజరాత్ తొలి వికెట్ పడింది.సుదర్శన్ ఔటయ్యాక జోస్ బట్లర్(50 నాటౌట్) జతగా గిల్ వీరవిహారం చేశాడు. సెంచరీ దిశగా దూసుకెళ్తున్నఅతడిని థీక్షణ ఔట్ చేసి రాజస్థాన్‌కు బ్రేకిచ్చాడు. కానీ, ఆ తర్వాత బట్లర్ బాదుడు షురూ చేశాడు. స్వీప్ షాట్లతో అలరిస్తూ స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించిన బట్లర్ ఆఖరి ఓవర్లో డబుల్స్ తీసి హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ సీజన్‌లో అతడికిది నాలుగో ఫిఫ్టీ. గుజరాత్ బ్యాటర్లలో వాషింగ్టన్ సుందర్(13) రాణించాడు. దాంతో, ప్రత్యర్థికి 210 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది గిల్ బృందం.

# అభిమానులకు గుడ్‌న్యూస్..

### 94 మ్యాచ్‌లతో ఐపీఎల్ పండుగ..!



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు ప్రతి ఏడాది ఆదరణ పెరుగుతోంది. టీ20ల్లో అతి పెద్ద క్రికెట్ పండుగగా పేరొందిన ఈ మెగా లీగ్ మండు వేసవిలో క్రీడాభిమానులను అలరిస్తోంది. ఐపీఎల్‌ను మరింత ఆకర్షణగా మార్చేందుకు బీసీసీఐ కీలక నిర్ణయానికి వచ్చింది. త్వరలోనే 94 మ్యాచ్‌లు ఆడించాలని భారత బోర్డు భావిస్తోంది. అన్నీ కుదిరితే 2028 నుంచే మ్యాచ్‌ల సంఖ్య పెంచేందుకు బీసీసీఐ సన్నాహకాలు చేస్తోందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించాడు. అయితే.. ఫ్రాంచైజీల సంఖ్య మాత్రం పెంచబోమని ఆయన స్పష్టం చేశాడు.

'ఐపీఎల్‌కు ఎంతో క్రేజ్ ఉంది. అందుకే మ్యాచ్‌ల సంఖ్యను పెంచాలనుకుంటున్నా. 2028 నుంచే 94 మ్యాచ్‌లతో లీగ్‌ను నిర్వహించాలనే ఉద్దేశం ఉంది. ఈ విషయమైన ఐసీసీ, బీసీసీఐ సభ్యులతో చర్చిస్తున్నాం. ఐసీసీ ఈవెంట్లు, ద్వైపాక్షిక సిరీస్‌లతో పాటు ఫ్రాంచైజీ క్రికెట్‌ను కూడా ఫ్యాన్స్ ఆదరిస్తున్నారు.

సో.. ఎక్కువ మ్యాచ్‌లు ఆడించడం ద్వారా వాళ్లకు మరింత వినోదాన్ని పంచాలనేది మా ఆలోచన. కాబట్టి.. ప్రస్తుతం 74 మ్యాచ్‌లతో సాగుతున్న ఐపీఎల్‌ను దశలవారీగా 84 నుంచి 94 మ్యాచ్‌లకూ తీసుకెళ్లాలని భావిస్తున్నాం. అప్పుడు.. ప్రతి జట్టు సొంత గడ్డపై, ప్రత్యర్థి గడ్డపై రెండేసి మ్యాచ్‌లు ఆడేందుకు వీలుంటుంది అని ధుమాల్ వివరించాడు. మ్యాచ్‌ల పెంపు గురించి హింట్ ఇచ్చిన ధుమాల్ జట్ల సంఖ్యను మాత్రం పెంచబోమని తేల్చి చెప్పాడు. అంటే.. ఇప్పుడున్న 10 ఫ్రాంచైజీలతోనే ఐపీఎల్ 2028 జరుగనుందన్నమాట.

ఆరంభ సీజన్‌లో 59 టీ20ల్లో సంచలనం రేకెత్తించిన ఐపీఎల్ ఆరంభ సీజన్(2008)లో 59 మ్యాచ్‌లు నిర్వహించారు. 8 జట్లు పోటీపడగా రాజస్థాన్ రాయల్స్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. 2010లో మ్యాచ్‌ల సంఖ్య 60కి చేరింది. ఆ తర్వాతి ఎడిషన్‌లో 74 మ్యాచ్‌లు. 2012లో 76 మ్యాచ్‌లు ఆడించారు. అయితే.. 2014 నుంచి 2021 వరకూ 60 మ్యాచ్‌లతోనే టోర్నీ ముగించారు.

అయితే.. 2022లో గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీలతో కలిపి 10 జట్లు బరిలోకి దిగడంతో మ్యాచ్‌ల సంఖ్యను మళ్లీ 74కు పెంచారు. మ్యాచ్‌ల సంఖ్య పెంపుపై బ్రాడ్‌కాస్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. డబుల్ హెడర్స్ ఎక్కువగా కవర్ చేయాల్సి వస్తుందనేది వాళ్ల వాదన. కానీ, బీసీసీఐ, ఐపీఎల్ పాలక వర్గం మాత్రం మ్యాచ్‌లను పెంచేందుకే మొగ్గు చూపుతోంది.

# తిప్పేసిన బంగ్లాదేశ్ స్పిన్నర్..

### జడేజా రికార్డు బద్దలు

**ఢాకా:** సుదీర్ఘ ఫార్మాట్‌లో బంగ్లాదేశ్ స్టార్ స్పిన్నర్ తైజుల్ ఇస్లాం రికార్డు సృష్టించాడు. టెస్టుల్లో అత్యధికంగా ఐదేసి వికెట్లు తీసిన ఐదో స్పిన్నర్‌గా రికార్డు నెలకొల్పాడు. స్వదేశంలో జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్టులో తైజుల్ ఈ ఘనతకు చేరువయ్యాడు. రెడ్ బాల్ క్రికెట్‌లో 5 వికెట్ల ప్రదర్శన చేయండి అతడికిది 16వ సారి. దాంతో, భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా రికార్డును తైజుల్ బద్దలు కొట్టాడు.

బంగ్లా తరఫున టెస్టుల్లో అత్యధికసార్లు ఐదు వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు తైజుల్. షకీబుల్ హసన్ టాప్‌లో ఉండగా.. మెహిదీ హసన్ మిరాజ్(12సార్లు) మూడో స్థానంలో ఉన్నాడు. అంతర్జాతీయంగా చూస్తే శ్రీలంక మాజీ స్పిన్నర్ రంగన హెరాత్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. మిస్టరీ స్పిన్నర్ అయిన హెరాత్ 34 పర్యాయాలు 5 వికెట్లు పడగొట్టాడు.

న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డానియల్ వెటోరీ 20 సార్లు ఐదేసి వికెట్లు తీసి రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబుల్ హసన్ ఈ జాబితాలో మూడో ప్లేస్‌లో ఉన్నాడు. ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ 19సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా.. ఇంగ్లండ్ స్పిన్నర్ డెరెక్ అండర్‌వుడ్ 17 సందర్భాల్లో 5 వికెట్లు నేలకూల్చాడు.





# మీ వినోదం కోసం మా బాబు టాపిక్ ఎందుకు?

### ట్రోలర్స్‌పై బుమ్రా భార్య ఫైర్



**న్యూఢిల్లీ:** తన కుమారుడు అంగద్‌పై విమర్శలు చేస్తున్న వారిపై భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా భార్య సంజనా గణేషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వినోదం కోసం తన కుమారుడి గురించి మాట్లాడటం సరికాదన్నారు. ఈ మేరకు ట్రోలర్స్‌పై విరుచుకుపడుతూ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు.

ఐపీఎల్‌లో భాగంగా ఆదివారం ముంబై ఇండియన్స్-లక్నో సూపర్ జెయింట్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్న బుమ్రా అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఇక ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు బుమ్రా భార్య సంజన గణేషన్ తన కుమారుడు అంగద్‌తో కలిసి స్టేడియానికి వచ్చింది. బుమ్రా వికెట్ తీసినప్పుడు అంగద్ గ్యాలరీలో చప్పట్లు కొడుతూ అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే, ఆ సందర్భంగా అక్కడున్న కెమెరామెన్‌లు అంగద్‌ను వీడియో తీశారు. మూడు సెకన్ల ఆ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు చిన్నారి అంగద్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. కొంత మంది నెటిజన్లు డిప్రెషన్, ట్రామా వంటి పదాలు వాడుతూ బుమ్రా- సంజనాలను విమర్శించారు. దీనిపై స్పందించిన సంజన.. విమర్శకులకు ధీటుగా సమాధానమిచ్చారు.

'మీ వినోదం కోసం మా కుమారుడి పేరును లాగొద్దు. నేను, బుమ్రా మా కుమారుడిని సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉంచేందుకు ప్రయత్నిస్తాం. ఎందుకంటే.. ఇంటర్నెట్‌లో ఎక్కువగా విద్వేషం, విషం చిమ్మే వాళ్లే ఉంటారని తెలుసు కాబట్టి. వేల కెమెరాలతో నిండిన క్రికెట్ స్టేడియానికి మా చిన్నారిని తీసుకురావడం వల్ల కలిగే ఇబ్బందులను నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను. కానీ మేము బుమ్రాకు మద్దతు ఇవ్వడానికి మాత్రమే ఇక్కడికి వచ్చామని అర్థం చేసుకోండి. మా కుమారుడు జాతీయ మీడియాలో గానీ, సోషల్ మీడియాలో గానీ వైరల్ అవ్వాలన్న ఆసక్తి మాకు లేదు. కేవలం 3 సెకన్ల వీడియోతోనే కొంతమంది కీబోర్డు వారియర్లు అంగద్ గురించి ఏదేదో మాట్లాడేస్తున్నారు. మా బాబుకు ఇప్పుడు ఇంకా ఏడాదిన్నర వయసు మాత్రమే. కానీ మీరు ట్రామా, డిప్రెషన్ వంటి పెద్దపెద్ద పదాలు వాడుతూ విమర్శలు చేస్తున్నారు. మీరు చేస్తున్న విమర్శలు చూస్తుంటే.. సమాజం ఎటు పోతుందోనని ఆందోళనగా ఉంది. ఇది నిజంగా విచారకరం. మా జీవితాల గురించి మీకు ఏమీ తెలియదు. అలాంటప్పుడు మాపై మీ సొంత అభిప్రాయాలు సరికాదు. ఎదుటి వారి పట్ల దయతో వ్యవహరించండి' అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు. ప్రస్తుతం సంజన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.

# బెల్లంకొండ మూవీ కిష్కింధపురి ఫస్ట్‌లుక్ రిలీజ్



**టాకీస్:** బెల్లంకొండ సాయి శ్రీనివాస్.. ప్రజంట్ వరుస సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రాల్లో 'భైరవం' ఇంకా 'టైసన్ నాయుడు' చిత్రాల షూటింగ్ దాదాపు ఫినిషింగ్‌కి రాగా. ఇక ఈ సినిమాలు కాకుండా సాయి శ్రీనివాస్ కెరీర్ తన 11వ సినిమా కూడా రాబోతుంది. దర్శకుడు కౌశిక్ పగళ్ళపాటి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంతో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, నిర్మాత సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక గ్రిప్పింగ్ హర్రర్-మిస్టరీ బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమా గురించి..తాజాగా మేకర్స్ ఇప్పుడు అఫీషియల్‌గా సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ కి 'కిష్కింధపురి' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయగా, ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ఎక్సయిటింగ్ ఎక్స్ ప్రెషన్స్‌తో కనిపిస్తున్నారు. చేతుల్లో జ్వాలలు పట్టుకుని, బెల్లంకొండ శ్రీనివాస్ , అనుపమ ఇద్దరు అడవిలో ఏదో వెతుకుతున్నట్లు కనిపించారు. బ్యాక్ డ్రాప్‌లో ఒక బంగ్లా కనిపించడం థ్రిల్లింగ్ వైబ్‌ని తిసుకొచ్చింది. మొత్తానికి టైటిల్, పోస్టర్ రెండూ మూవీ పై అంచనాలు పెంచగా, ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా మేకర్స్ ఏప్రిల్ 29న సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేస్తామని ప్రకటించారు.



# త్వరలోనే పెళ్లి చేసుకుంటా

## నటుడు విశ్వక్‌సేన్ మనసులో మాట

**టాకీస్:** టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. మంచి టాలెంట్ ఉన్న విశ్వక్ సేన్ ఎందుకో సూపర్ హిట్స్ అందుకోలేకపోతున్నాడు. చివరిగా 'లైలా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఘోర పరాజయం పొందింది. ఈ సినిమా కోసం విశ్వక్ సేన్ చాలా కష్టపడ్డాడు. ప్రమోషన్స్ కూడా గట్టిగానే చేశాడు. అయిన ఫలితం మారలేదు. ఈ సారి మాత్రం గట్టి హిట్ కొట్టాలనే కసి మీద ఉన్నాడు.

లైలా సినిమా ఫెయిల్యూర్ తర్వాత విశ్వక్ సేన్ పెద్దగా కనిపించింది లేదు. తాజాగా నేచురల్ స్టార్ నాని నటించిన 'హిట్ 3' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హాజరై అదిరిపోయే స్పీచ్ ఇచ్చాడు. హిట్ ఫ్రాంచైజీ ఫస్ట్ పార్ట్‌లో విశ్వక్ సేన్ నటించిన నేపథ్యంలో హిట్ 3 ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ఆహ్వానించారు. ఆయన్ను సుమ సరదాగా ఇంటరాగేషన్ చేశారు. ఆఫీసర్‌నే ఇంటరాగేషన్ చేస్తారా? అంటూ సుమను ప్రశ్నించాడు విశ్వక్.. ఇప్పుడు ఆఫీసర్ అర్జున్ సర్కార్ కదా.. అని సుమ అనడంతో దీనికి 'మా తెలంగాణ బ్రాంచ్‌లో నేనే కదా ఆఫీసర్‌ను' అని విశ్వక్ సరదాగా కామెంట్ చేశారు. ఈ మధ్యే నా వయస్సు 30కి చేరుకుందని , ఇప్పుడు కాస్త స్పీడ్ తగ్గించి కూల్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తు న్నాను. ఊరికే అటు ఇటు పరిగెడుతూ ఉన్నా.. ఇప్పటి నుంచి అది తగ్గిపోతుందని అని చెప్పారు.

## రావిపూడి-చిరు సినిమాపై

# భారీ అంచనాలు

## చిరుకు జోడీగా నయనతార అంటూ వార్తలు





**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావుపూడి కాంబినేషన్ ఓ మూవీ రాబోతున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఈ సినిమా పూజాకార్యక్రమాలు కూడా పూర్తి చేసుకుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ రూమర్ నెట్టింట వైరల్ అవుతోంది. అదేంటంటే.. ఈ చిత్రంలో చిరు సరసన మరోసారి నయనతార నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. నయనతార తోపాటు ఇందులో బాలీవుడ్ నటి పరిణితి చోప్రా కూడా కీలక పాత్రలో నటిస్తారని సినీ వర్గాల టాక్. ఇప్పటికే నయనతార..చిరుకు జోడీగా సైరా సినిమా చేసిన విషయం తెలిసిందే. అయితే, అందులో సాంగ్స్ కు గానీ, రొమాన్స్ కు గానీ పెద్దగా స్కోప్ లేకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహపడ్డారు. ఇక, గాడ్ ఫాదర్ లో చెల్లిగా నటించినా.. ఇద్దరి మధ్య డైలాగ్స్ లేవు. ఈ క్రమంలో అనిల్ తెరకెక్కించబోయే సినిమాలో చిరు, నయన్ కలిసి నటిస్తే.. ఫ్యాన్స్ కు పండగనే చెప్పాలి. ఈ సినిమా కామెడీ, మాస్ ఎంటర్ టైనర్ గా రూపొందనుంది. ఇందులో అనిల్.. వింటేజ్ మెగాస్టార్ ను చూపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో చిరు-నయన్ మధ్య రోమాన్స్, సాంగ్స్ చూసి అభిమానులు ఎంజాయ్ చేసే అవకాశం ఉంది. కాగా, ఈ మూవీ షూటింగ్ త్వరలోనే ప్రారంభించనున్నారు. టాలీవుడ్ లో వరుస విజయాలు అందుకున్న దర్శకులో అనిల్ రావిపూడి ఒకరు. రీసెంట్ గా 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. . ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి కోసం ఓ స్క్రిప్ట్ రెడీ చేస్తున్నారు. ఇప్పటికే వీరి మధ్య కథా చర్చలు కూడా పూర్తయ్యాయి. వైజాగ్ లో అనిల్ రావిపూడి తన టీమ్ తో కలిసి స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమా కథ గురించి మాట్లాడుకుంటే.. ఇది పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని, ఈ మూవీ షూటింగ్ కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను అని, ఇంతకు ముందు చిరంజీవి పలు ఇంటర్వ్యూలలో ఇప్పటికే చెప్పేశారు. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి కి సిస్టర్ రోల్ ఉందని..ఈ పాత్రలో సీనియర్ హీరోయిన్ జ్యోతిక నటించబోతుందని టాక్ నడుస్తోంది. మరి ఈ వార్తలో ఎంతవరకు నిజం ఉందో తెలియదు, కానీ ఈ న్యూస్ వైరల్ అవుతుంది. ఇంతకు ముందు చిరు ఇంకా జ్యోతిక 'ఠాగూర్' మూవీలో జంటగా నటించారు. అప్పట్లో ఈ జోడికి మంచి మార్కులు కూడా పడ్డాయి. ఇక ప్రజంట్ జ్యోతిక కూడా ఫుల్ ఫామ్‌లో ఉంది.. వరుస సినిమాలు అలాగే పలు హిందీ సిరీస్‌లో కూడా నటిస్తోంది.




# వింక్ బ్యూటీకి మళ్లీ పెరుగుతున్న క్రేజ్

టాకీస్: మలయాళీ ముద్దుగుమ్మ ప్రియా ప్రకాశ్ వారియర్ ఒకప్పుడు సోషల్ మీడియాని షేక్ చేసింది. ఒరు ఆదార్ లవ్ సినిమాలోని కన్ను గీటే సన్నివేశంతో ఓవర్ నైట్ స్టార్‌డం అందిపుచ్చుకుంది. ఆ ఒక్క కన్నుగీటుతోనే పాన్ ఇండియా గుర్తింపు దక్కించుకుంది ప్రియా ప్రకాశ్ వారియర్. ఆ తర్వాత పలు సినిమాలలో నటించింది. అయితే 2018లో గూగుల్‌లో ఎక్కువగా వెతికిన సెలబ్రిటీగా పేరు తెచ్చుకుంది ప్రియా వారియర్. అంతేకాదు ఒక్క రోజులో 6 లక్షల మందికి పైగా ఫాలో అయిన ఏకైక నటిగా రికార్డు సృష్టించింది ప్రియా వారియర్. తెలుగు, తమిళం, హిందీ భాషలలో హీరోయిన్‌గా పలు సినిమాల్లో నటించినా పెద్దగా సక్సెస్‌లు దక్కించుకోలేక పోతున్న ఈ అమ్మడు ఇటీవల తమిళ్ స్టార్ హీరో అజిత్ నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో గెస్ట్ రోల్ పోషించింది. అలానే ఐటెం సాంగ్‌లోను కనిపించి తన డ్యాన్స్‌తో అదరగొట్టింది. సినిమాలో కనిపించింది కొద్ది సమయం అయినా కూడా ప్రియా ప్రకాశ్‌కి మాత్రం మంచి గుర్తింపు లభించింది. ఈ సినిమాలో ప్రియా ప్రకాశ్ వారియర్ నిత్య పాత్రలో నటించగా, ఆమె 'తొట్టు తొట్టు' పాటలో అదిరిపోయే డ్యాన్స్ చేసింది. ఆమె డ్యాన్స్‌కు ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. ఈ సాంగ్‌లో స్టెప్పులు కన్ను గీటడానికి మించి వైరల్ అవుతున్నాయి. తాను ఎంతగానే అభిమానించే అజిత్ చిత్రంలో భాగం కావడాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని ప్రియా ప్రకాశ్ చెప్పుకొచ్చింది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా తర్వాత ప్రియా ప్రకాష్ వారియర్‌కి మరిన్ని ఆఫర్లు తెచ్చి పెట్టే అవకాశాలు ఉన్నాయని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అజిత్ గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా బాక్సాఫీస్ దగ్గర దాదాపుగా రూ.200 కోట్ల వసూళ్లు సాధించినట్లు సమాచారం అందుతోంది. ఆ స్థాయి వసూళ్లు నమోదు కావడంతో మాత్రమే కాకుండా సినిమాలో ఆమె పాత్రకు, ఆమె ఐటెం సాంగ్‌కి మంచి గుర్తింపు దక్కిందని ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. చాలా మంది ఈ పాటను షార్ట్ వీడియో లేదంటే రీల్స్‌గా షేర్ చేస్తున్నారు. తద్వార ప్రియా ప్రకాష్ వారియర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## అమెరికాలో

# కన్నప్ప ప్రచారం

## మే 8 నుంచి వరుస ప్రచార కార్యక్రమాలు



**టాకీస్:** మంచు విష్ణు కీలక పాత్రలో రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప' ముకేశ్ కుమార్‌సింగ్ దర్శకత్వం వహించారు. ప్రీతి ముకుందన్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పనులు పూర్తిచేసుకున్న ఈ మూవీ జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈక్రమంలో మంచు విష్ణు ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. గత కొన్నేళ్లుగా తెలుగు సినిమాలకు అమెరికాలో మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో అక్కడి మార్కెట్‌పైనా దృష్టిపెట్టారు. ఇందులోభాగంగానే 'కన్నప్ప' మూవీకి సంబంధించి పలు ఈవెంట్‌లను ప్లాన్ చేశారు. మే 8వ తేదీ నుంచి వరుసగా ప్రచార కార్యక్రమాలు జరగనున్నాయి. అలాగే రోడ్‌షోలను కూడా నిర్వహిస్తున్నారు. న్యూజెర్సీ ఇందుకు వేదిక కానుంది. డల్లాస్, లాస్ ఏంజిల్స్ సహా అమెరికాలోని పలు ప్రాంతాల్లో 'కన్నప్ప'ను ప్రచారం చేయనున్నారు. 'కన్నప్ప' ప్రచారం విషయంలో మంచు విష్ణు మంచి ప్లానింగ్‌తో ముందుకువెళ్తున్నారు. మే నెల మొదటి 15 రోజుల్లో అమెరికాలో ప్రచారం పూర్తి చేసి, తిరిగి వచ్చిన తర్వాత భారత్‌లో అందుకు సంబంధించిన ఈవెంట్‌లను నిర్వహించనున్నారు. జూన్ 27న విడుదల నేపథ్యంలో నెల రోజుల పాటు వివిధ నగరాల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అమెరికా పర్యటన పూర్తయిన తర్వాత దీనికి సంబంధించిన షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ ప్రచారంలో సినిమాలో కీలకపాత్రలు పోషించిన నటీనటులు కూడా పాల్గొననున్నారు. మోహన్‌బాబు, శరత్‌కుమార్, ముకేశ్ రుషి, రఘుబాబు, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌లాల్, కాజల్, అక్షయ్‌కుమార్ అతిథి పాత్రల్లో కనిపించనున్నారు. ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ పతాకంపై మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ మూవీకి విష్ణునే కథ, స్క్రీన్‌ప్లే అందించారు. దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ మూవీని తీర్చిదిద్దారు.

# సమంత శుభం ట్రైలర్ విడుదల






టాకీస్: హీరోయిన్ సమంత నిర్మిస్తున్న తొలి మూవీ 'శుభం'. అంత కొత్తవారితో తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఇందులో మల్గిరెడ్డి, శ్రియ కొంథం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు సమంత. ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఇందులో సామ్ కూడా కీ రోల్ లో నటించారు. కామెడీ, హర్రర్ నేపథ్యంలో రూపొందించిన ఈ సినిమా మే 9న విడుదల కానుంది.

# నేను కొందరిని బాధపెట్టాను..

## శ్రుతి హాసన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్..!

టాకీస్: శ్రుతి హాసన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. కమల్ హాసన్ వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి వచ్చింది. కెరియర్ తొలినాళ్లలో వరుస ఫెయిల్యూర్స్‌తో ఇబ్బందిపడ్డా.. ఆ తర్వాత వరుస హిట్‌లతో అగ్రహీరోయిన్‌గా ఎదిగింది. అయితే, శ్రుతి సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితం, లవ్ ఎఫైర్స్, బ్రేక్‌లతో వార్తల్లో నిలుస్తుంది. ప్రేమ వ్యవహారాలు, బ్రేక్‌లపై సైతం ఎలాంటి దాపరికం లేకుండానే స్పందిస్తూ వస్తుంది. ఇటీవల ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గత సంబంధాలతో పాటు వాటి నుంచి నేర్చుకున్న పాఠాలు చేర్చుకున్నానని వ్యాఖ్యానించింది.

ఇటీవల ఓ ప్రముఖ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఆమె తన గత సంబంధాలు, వాటి వల్ల నేర్చుకున్న పాఠాలు, పశ్చాత్తాపంపై కీలక వ్యాఖ్యలు చేసింది. కొంతమంది చాలా విలువైన వ్యక్తులను బాధపెట్టానని.. అలా చేసి ఉండాల్సి కాదని అనిపిస్తుందని చెప్పింది. దానిపై ప్రస్తుతం బాధపడుతూ.. క్షమాపణలు కోరుంటానని తెలిపింది. మిగతా విషయాల్లో తనకు ఎలాంటి రిగ్రెట్స్ లేవని.. పలుసార్లు సరదాగా, అనాలోచితంగా ప్రవర్తించినా ఇతరులను బాధపెట్టడం మాత్రం బాధ కలిగిస్తుందని పేర్కొంది. తన లవర్ ఎఫైర్స్, బ్రేక్‌లపై స్పందిస్తూ.. అందరి జీవితంలో ఓ ప్రమాదకరమైన మాజీ ప్రేమికుడు ఉంటాడని.. అది తప్ప మిగతా బంధాలను ఎలాంటి పశ్చాత్తాపం లేకుండానే ముగించినట్లు చెప్పింది. తనను చాలామంది ఇతను ఎన్నో బాయ్‌ఫ్రెండ్ అని ప్రశ్నిస్తుంటారని.. వారికి అది కేవలం ఒక నెంబర్ మాత్రమేనని.. తాను మాత్రం కోరుకున్న పొందడంలో విఫలమయ్యాదన్న దానికి గుర్తు మాత్రమేనని.. దాన్ని గురించి సిగ్గుపడనని, మనిషిగా కొంచెం బాధగా ఉంటుందని తెలిపింది. రిలేషన్ షిప్‌లో తాను ఎప్పుడూ నిజాయితీగానే ఉన్నామని.. భాగస్వాములతో విడిపోయినప్పుడు వారిని తానెప్పుడు నిందించలేదని గుర్తు చేసింది. ఈ వైఫల్యాల నుంచి ఎంతో నేర్చుకున్నానని.. వాటిని తన ఎదుగుదలకు సోపానాలుగా భావిస్తున్నట్లు చెప్పింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.